
**ఎక్సైజ్‌శాఖలో బదిలీలు**
ఏలూరు డిప్యూటీ కమిషనర్‌గా బి.శ్రీలత 7

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





## సహజసిద్ధమైన ఎరువులనే వాడాలి

- పొలంబడి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి..
- పంట పొలాల్లో పర్యటించిన కలెక్టర్, ఎమ్మెల్యే చింతమనేని



పోతునూరులో వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు,సెప్టెంబరు 25 : రైతులు రసాయనక ఎరువులు వాడకుండా సహజసిద్ధమైన ఎరువులను వాడుతూ తప్పనిసరిగా నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో ఎక్కు దిగుబడి ఎక్కువ ఆదాయం పొందాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. పోతునూరులో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన కౌలు రైతు పిన్నంశెట్టి రవికుమార్‌కు చెందిన వరి పొలంలో వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులతో కలిసి పంటలను పరిశీలించారు. కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం పంట పొలాలకు వచ్చే వ్యాధుల నిర్మూలన కోసం ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను తెలిపేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నాన్నారు. ప్రతి రైతు ఏ పంట వేసిన తప్పని సరిగా ఈ-పంట యాప్ ద్వారా పంటలను నమోదు చేసుకోవాలన్నారు. ఆర్డీవో ఖాజావలి, వ్యవసాయశాఖ ఏడీ సుబ్బారావు, ఉద్యానవన శాఖ అధికారి బి.కిరణ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఐశ్వర్య, పోతునూరు నాయకులు నున్న లక్ష్మణ్, బోడేటి మోహన్‌బాబు, గండి రాజా, జనసేన నాయకురాలు వెంకటలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## చింతలపూడి ఎత్తిపోతలు పూర్తిచేస్తాం

- మంత్రి కొలుసు పార్థసారథి




పల్లెర్లమూడి సభలో ప్రసంగిస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, సెప్టెంబరు 25 : చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి నూజివీడు నియోజకవర్గ ప్రజల కలను నెరవేరుస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బుధవారం నూజివీడు మండలం పల్లెర్లమూడిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి 100 రోజుల్లో ఎన్డీయే ప్రభుత్వం చేసిన వివిధ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. ' గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మూలన పడిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తిచేసి నూజివీడు, చింతలపూడి నియోజకవర్గ రైతుల ఆశలను నెరవేర్చి రైతులకు సాగు, తాగు నీరు అందించేందుకు ఈ రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉంది. జగన్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని రంగాలను విచ్ఛిన్నం చేసింది. ఇటీవల వరదలకు నష్ట పోయిన బాధితులకు బుధవారం నష్టపరిహారం విడుదల చేశాం. ఇంకా మిగిలిన బాధితులకు కూడా త్వరలో అందజేస్తాం. సమర్థుడైన ముఖ్యమంత్రి చేతిలో రాష్ట్రపాలన ఉంటే రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి పథాన నడుస్తుందో అనేదానికి చంద్రబాబు మూడునెలల పాలనే నిదర్శనం. గత ప్రభుత్వంలో ప్రతినెలా ఒకటో తేదీన ఇవ్వాల్సిన జీతాలను 22వ తేదీ వరకు ఇచ్చే పరిస్థితి.. అదీ అప్పుచేసి ఇచ్చేవారు. చంద్రబాబు ప్రభుత్వంలో అప్పు చేయకుండానే ఒకటో తేదీనే జీతాలు అందిస్తున్నాం. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నాం' మన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

- ఐజీ అశోక్ కుమార్



పోలవరం, సెప్టెంబరు 25 : గంజాయి, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్టు ఏలూరు రేంజి ఐజీ జీ.వి.జి.అశోక్ కుమార్ తెలిపారు. ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్‌తో కలసి పోలవరం సబ్ డివిజనల్ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఐజీ మాట్లాడుతూ.. 'సబ్ డివిజన్ పరిధిలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్టు తమ దృష్టికి రాలేదు. గిరిజన గిరిజనేతర భూవివాదాలు, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సైబర్ నేరాలు జరిగిన వెంటనే స్పందించి 1930 నెంబరుకి ఫిర్యాదు చేస్తే సొమ్ము రికవరీ చేస్తారు. దీని గురించి పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సబ్ డివిజన్ పరిధిలో గంజాయి, నాటుసారా ప్రభావం అంతగా ఉన్నట్లు మా దృష్టికి రాలేదు. గంజాయిని నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి పట్టుకుంటే ఎలా పరీక్షలు నిర్వహించాలనే విషయాలపై పోలీసులకు శిక్షణ ఇచ్చి నవీన పరికరాలు అందిస్తాం. తరచూ గంజాయి రవాణా విక్రయాలు చేసేవారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తాం. నార్కోటిక్ సెల్ ఐజీ ఆధ్వర్యంలో ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపిస్తాం. సోషల్ మీడియాలో అవాస్తవ పోస్టులు పెట్టి వివాదాలకు కారణమయ్యే వారిపై చర్యలు తీసుకుంటాం. సబ్ డివిజన్ పరిధిలో మూడు పోలీస్ స్టేషన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. స్టేషన్లలో ఖాళీగా ఉన్న సిబ్బంది కొరతని త్వరలో భర్తీ చేస్తాం. మోటారు బైకుల దొంగతనాల ముఠాని పట్టుకున్నాం. ఏలూరు పోలీసులతో స్థానిక పోలీసులు సమన్వయం చేసుకుని విచారిస్తారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో కుక్కునూరు, వేలేరుపాడు పాపికొండల ప్రాంతాల్లో నిఘా ఉంచాలని ఆదేశించాం 'మని తెలిపారు. డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ బాల సురేష్ కుమార్, ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టును సందర్శించి భద్రతా ఏర్పాట్లను ఐజీ పరిశీలించారు. ప్రాజెక్టు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు పోలీసులు సంబంధిత వివరాలు తెలిపారు.

## టీటీసీ పరీక్షలు వాయిదా

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 25 : టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్‌లూమ్, వీవింగ్ లోయర్‌గ్రేడ్‌లకు సంబంధించి గతంలో జరిగిన ఈ పరీక్షల్లో ఫెయిలైన ప్రైవేటు విద్యార్థులకు థియరీ పరీక్షలను 'టెట్' పరీక్షల కారణంగా అక్టోబరు 27 నుంచి నిర్వహించేలా వాయిదా వేసినట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు రాష్ట్రంలో విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురం జిల్లాల్లో మాత్రమే జరుగుతాయని వివరించారు. సవరించిన తేదీలతో కూడిన పరీక్షల హాల్ టిక్కెట్లను త్వరలో బీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు.



ముసునూరు మండలం సింహాద్రిపురం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న రామిలేరు వాగు

## అల్పపీడన ప్రభావంతో వర్షాలు

- ముసునూరులో అత్యధికంగా 88.4 మి.మీ వర్షపాతం నమోదు
- భారీ వర్షాలతో రైతుల్లో ఆందోళన

ఏలూరుసిటీ, సెప్టెంబరు 25 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీన పడినా జిల్లాలో పలు ప్రాంతాల్లో భారీగా, పలు ప్రాంతాల్లో స్వల్పంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో సార్వా వరి సాగులో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా బుధవారం మబ్బుల వాతావరణం నెలకొని ఉంది. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా ముసునూరు మండలంలో 88.4 మిల్లీమీటర్లు (8.8 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 18.8 మి.మీ నమోదైంది. చింతలపూడి 56.2, ఆగిరిపల్లి 48.2, జీలుగుమిల్లి 45.8, నూజివీడు 36.4, మండవల్లి 35.2, ముదినేపల్లి 31.2, ద్వారకాతిరుమల 25.4, టి.నరసాపురం 20, పోలవరం 19.2, ఏలూరురూరల్ 17.2, పెదపాడు 16.2, భీమడోలు 14.6, కైకలూరు 12.8, నిడమర్రు 10, ఏలూరు అర్బన్ 9.6, పెదవేగి 9.4, కలిదిండి 8.8, దెందులూరు 6.2 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన మండలాల్లో 5 మి.మీ కంటే తక్కువగానే వర్షపాతాలు నమోదయ్యాయి.

### కలవర పరుస్తున్న వర్షాలు

జిల్లాలో వరితో పాటు ఇతర పంటల సాగు మొత్తం కలిపి సార్వాలో 2.05 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ప్రధానంగా వరి సాగు 1,86,699 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల వరి నాట్లు, నారుమళ్ల దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. ఇప్పుడు అల్ప పీడనం కారణంగా వర్షాలు భారీగా కురిస్తే ఆరుగాలం శ్రమించినా పంట దక్కని పరిస్థితులు ఎదురవుతాయని రైతులు వాపోతున్నారు. ఒక పక్క సార్వా వరి ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం అవుతున్న తరుణంలో వర్షాలు భారీగా కురిస్తే వరి పంట నేలవాలిపోయి కోతకు పనికిరాకుండా పోతుందని చెబుతున్నారు. ముఖ్యంగా కౌలు రైతులు పంట నష్టపోతే తీవ్రంగా ఆర్థిక నష్టాలను చవి చూడాల్సి వస్తుందని కౌలు రైతులు పేర్కొంటున్నారు.

### ఎర్రకాల్వ నుంచి నీరు విడుదల

**జంగారెడ్డిగూడెం** : ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో కొంగువారిగూడెంలోని కేకేఎం ఎర్రకాల్వ జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం గంటకు 3 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా 17 వందల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ డీఈ రాంబాబు తెలిపారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 82.90 మీటర్లు ఉన్నట్టు తెలిపారు.

## గిరిజన దర్బార్‌ను బుధవారమే నిర్వహించాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 25 : కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సమస్యల పరిష్కారం కోసమే నిర్వహించే గిరిజన దర్బార్‌ను బుధవారమే నిర్వహించాలని, సోమవారానికి మార్పు చేయడం సరైంది కాదని ఇష్టూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ డిమాండ్ చేశారు. సోమవారానికి మార్చడం వల్ల ఏజెన్సీ అటవీ ప్రాంతంలోని మారుమూల గ్రామాల ఆదివాసీలు ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమానికి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. బుధవారం నిర్వహిస్తే అదే రోజున కన్నాపురంలో వారపుసంత జరుగుతుందని నిత్యావసర సరుకులు ఇతర వాటిని కొనుగోలు చేయడానికి తప్పకుండా దూరప్రాంతాల కొండరెడ్లు కొండలు దిగి అడవులుదాటి కన్నాపురం వస్తారన్నారు. వారపుసంతకు వచ్చిన ఆదివాసీలు అదే రోజున ఐటీడీఏలో జరిగే గిరిజన దర్బార్‌కు హాజరై అధికారులకు తమ సమస్యలను చెప్పుకుని వినతిపత్రాలను అందజేస్తారన్నారు. ఈ కారణంతోనే గతం నుంచి గిరిజన దర్బార్‌ను బుధవారం నిర్వహిస్తూ వస్తున్నారన్నారు.

# మా సంగతేంటి!



## బీజేపీ, జనసేనల్లో చిర్రుబుర్రు

- నామినేటెడ్ స్థానాల్లో అవకాశం ఉంటుందా..లేదా అనే సందేహాలు
- రాష్ట్ర నాయకత్వం దృష్టి పెట్టాలంటున్న ఇరు పార్టీల నేతలు
- టీడీపీ తరహాలోనే తమకూ అవకాశం ఇవ్వాలంటున్న ఇంకొందరు
- జిల్లా అంతటా ఇదే చర్చే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఏలూరు జిల్లాలో బీజేపీ పక్షాన కైకలూరులో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉంగుటూరు, పోలవరం నియోజకవర్గాల నుంచి పత్సమట్ల ధర్మరాజు, చిర్రి బాలరాజు జనసేన ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఈ మూడు నియోజక వర్గాల్లోనే కాకుండా జిల్లావ్యాప్తంగా మిగతా నియోజక వర్గాల్లోను పదవులను ఆశించే కేడర్ సంఖ్య తక్కువేమీకాదు. ఈ మేరకు నామినేటెడ్ జాబితాలో తమ పేరు ఉండాలనే రీతిలోనే పట్టుపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్దేశిత శాతం ప్రకారమే నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రకియ జరగబోతుందని నెలన్నర క్రితమే సీఎం చంద్రబాబు సూచాయగా ప్రకటించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అటు తెలుగుదేశం, కూటమిలో భాగస్వామ్యపక్షాలైన బీజేపీ, జనసేనలో గాని ఎవరికీ సరైన స్పష్టత లేదు. ఇదంతా క్షేత్రస్థాయిలో కొంత గందరగోళంగా మారింది.

### టీడీపీలో పక్కా ప్రణాళిక

తెలుగుదేశం విషయానికి వచ్చేసరికి గత ఎన్నికల్లో టికెట్లు ఆశించి పొత్తు ధర్మంలో భాగంగా పోటీలో నిలబడకుండా పక్కకు జరిగిన సీనియర్లతో పాటు క్షేత్రస్థాయి కార్యకర్తలకు పోస్టులు దక్కేలా పక్కా ప్రణాళిక రూపొందించారు. తొలి జాబితాలో ఆ విధంగానే కూర్పు చేశారు. రాబోయే రెండు, మూడు జాబితాల్లోను తెలుగుదేశం పక్షాన అత్యధికులకు అవకాశం దక్కబోతుంది. ప్రత్యేకించి టీడీపీలో అత్యంత కీలకమైన కార్పొరేషన్లలో సామాజిక వర్గపరంగా అవకాశం కల్పించే దిశగానే కసరత్తు సాగింది. అన్నింటినీ క్రోడీకరించి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే జాబితాకు ఓ రూపు వస్తుంది. ఎమ్మెల్సీ దగ్గర నుంచి కార్పొరేషన్ ఛైర్మన్లు, ఆఖరుకి కేంద్రస్థాయిలో ఎఫ్‌సీఐ దగ్గర నుంచి రైల్వే వరకు ఎక్కడ వీలైతే అక్కడ సీనియర్లకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే పక్కా ప్రణాళిక రూపొందించుకుంది.

### బీజేపీ, జనసేనల్లోనే గందరగోళం

నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియలో తెలుగుదేశంలో కొంతలో కొంత స్పష్టత ఉన్నా బీజేపీ, జనసేనకు వచ్చేసరికి కాస్తంత గందరగోళం ఉంది. ఛైర్మన్ పదవులు కాకుండా డైరెక్టర్ పదవుల్లోను తమకు అవకాశం వస్తుందా..? రాదా? అనే మీమాంస వారిలో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఎలాగూ జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు గెలిచిన నియోజక వర్గాల్లో మార్కెట్ కమిటీలు, మునిసిపల్ కో-ఆప్షన్ సభ్యుల నియామకంలో ఆయా పార్టీలకు చెందిన నేతలకే అగ్ర ప్రాధాన్యత ఉండబోతుంది. కైకలూరు, ఉంగుటూరు, పోలవరంలలో రానున్న కొద్ది రోజుల్లోనే ఈ తరహా నియామకాలు జరగబోతున్నాయి. ఎటుతిరిగి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీలో నెలకొన్న గందరగోళానికి రాష్ట్ర పార్టీ నేతలు సైతం సమాధానం ఇవ్వలేకపోతున్నారని ఈ రెండు పార్టీల్లోను నాయకులు కాస్త గుర్రుగానే ఉన్నారు. ఎందుకంటే తమ పార్టీ పక్షాన నామినేటెడ్ పోస్టులకు మీరు అర్హులు అంటూ జిల్లా స్థాయిలో జాబితాలు రూపొందించారా లేదా, ఒకవేళ రూపొందించి ఉంటే సూచాయగా అయినా జిల్లా పార్టీ అధ్యక్షులకు తెలిసేదికదా, అలా ఎందుకు తెలియకుండా గుట్టుగా ఉంచేశారేంటంటూ నిలదీస్తున్నారు. ఇప్పటిరకు పార్టీ కోసం కష్టించి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వడానికి టీడీపీ భారీ కసరత్తు చేస్తుండగా మిత్రపక్షాల్లో ఉన్న తమకు అలాంటి అవకాశాలు వచ్చేటట్టు కనిపించడం లేదన్న అసంతృప్తి వీరందరిలోనూ ఉంది.

కేంద్ర స్థాయిలో ఎఫ్‌సీఐ, రైల్వే, పౌర విమానయాన, డిఫెన్స్ సర్వీసెస్, పరిశ్రమల మండలి ఈ తరహా వాటన్నింటిలోనూ గతంలో బీజేపీకి చెందిన వారిలో కొందరికే అవకాశం కల్పించారు. ఆఖరుకి నౌకాయాన విభాగంలోను తగిన రీతిలో నామినేట్ కావడానికి అప్పట్లో కొందరు ప్రయత్నించారు. మరి కొందరైతే బీఎస్ఎన్ ఎల్‌లో సభ్యులుగా కావడానికి తమ వంతు ప్రయత్నాలు చేశారు. ఈసారి వీటన్నింటిపై బీజేపీ లో ఉలుకుపలుకు లేదు.

ఏలూరు పార్లమెంటు స్థానం నుంచి టికెట్ ఆశించి ఆ మేరకు ఆర్థిక ప్రయాసకోర్చడమే కాక పార్టీపరంగా అన్ని విధాలా అండగా ఉండి చివరకు అవకాశం కోల్పోయిన రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి గారపాటి చౌదరి లాంటి నేతలకు ఇప్పటివరకు ఎలాంటి సానుకూల సంకేతాలు అందలేదు. ఆయనతో పాటు అనేకమంది సీనియర్లు పార్టీలో ఉండగా వారికి కూడా రాష్ట్ర పార్టీ నుంచి కనీసం అవకాశాల విషయంలో అధికారికంగా ఏ మాత్రం వినిపించడంలేదన్న వాదన బీజేపీలో బలంగా ఉంది.

> నామినేటెడ్ పోస్టుల్లో నియామకం ఆరంభమైంది. ఆశలు పెంచుకున్న నేతలెందరో.. కాని నామినేటెడ్ పోస్టుల భర్తీకి అంత అనువైన సంఖ్య ఉందా. ఒకవైపు టీడీపీని సంతృప్తి పరుస్తూనే ఇంకోవైపు జనసేన, బీజేపీలను బుజ్జగించాల్సి వస్తోంది. ఈ రెండు పార్టీల్లో ఆశావహుల సంఖ్య ఒక్కో జిల్లాలోను డజన్ల సంఖ్యలోనే ఉంది. ఆ మేరకు ఇరు పార్టీ ల్లోను పెద్ద ఎత్తున ఒత్తిడి తేవాలని క్షేత్రస్థాయి నేతలు ఇప్పటికే వ్యూహానికి దిగారు. తమ పార్టీ రాష్ట్ర నాయకత్వాలను ఒప్పించి మెప్పించి ఆయా పదవుల్లో తాము కూడా నామినేట్ కావాలనే ఆంక్ష వారిలో బలంగా ఉంది.

జనసేన విషయంలోను పార్టీ టికెట్‌లను వివిధ నియోజకవర్గాల నుంచి అనేకమంది ఆశించారు. ఏలూరు నియోజకవర్గం నుంచి రెడ్డి అప్పలనాయుడు పోటీ పడినా పొత్తులో భాగంగా ఆ అవకాశం ఆయనకు దక్క లేదు. ఇప్పుడు నామినేటెడ్ పోస్టుల విషయంలోను ఈ తరహా నేతలకు ఎలాంటి అవకాశాలు కల్పిస్తారనేది పార్టీపరంగా చర్చించేందుకు ఇప్పటివరకు ఎవరూ చొరవ తీసుకోకపోవడం విశేషం. ఈ పరిస్థితుల్లో ఈ రెండు పక్షాల్లోను కొంత గందరగోళం నెలకొనగా, ఇంకోవైపు పార్టీ అగ్ర నాయకత్వం దృష్టిపెట్టడం లేదన్న అక్కసు లేకపోలేదు. ఇప్పటివకు బీజేపీ నేతలంతా సభ్యత్వ నమోదులోనే తలమునకలై ఉన్నారు. నామినేటెడ్ పోస్టుల విషయానికి వచ్చేసరికి ఎవరూ నోరు మెదకపోవడంతో తమ కెందుకులే అన్నట్టుగా సీనియర్లు మిగిలిపోతున్నారు. ఇంకోవైపు రానున్న జాబితాల్లో బీజేపీ, జనసేన నేతల పేర్లు చోటు చేసుకుంటాయన్న సంకేతాలు లేకపోలేదు. వివిధ కార్పొరేషన్‌లలో డైరెక్టర్ స్థానాల్లో ఇరు పార్టీలకు చెందిన నేతలకు చోటు ఇవ్వబోతున్నట్టు చెబుతున్నారు.

## 20 కొత్త పరిశ్రమలకు రూ.1.14 కోట్ల రాయితీలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 25 : సింగిల్ విండో విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు అందిన దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక మండలి సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 110 మందికి పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశామని, చిన్నకారణాలతో దరఖాస్తులను తిరస్కరించకుండా నిబంధనలకు విరుద్ధంగావున్న వాటికి సంబంధించి కారణాలను కూడా తెలపాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక ఉద్యోగ అవకాశాలు కల్పించే పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు. పీఎంఈజీపీ కార్యక్రమం కింద అందిన 151 దరఖాస్తుల్లో 102 దరఖాస్తులు బ్యాంకర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసిన 20 యూనిట్లకు రూ. 1.14 కోట్ల విద్యుత్, వడ్డీ, అమ్మకం పన్ను, పెట్టుబడి రాయితీలుగా అందించేందుకు సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు. డీఐసీ జనరల్ మేనేజర్ ఆదిశేషు, ఫిషరీస్ జేడీ నాగలింగాచారి, ఉద్యానవనశాఖ డీడీ మోహనరావు, ఏపీఐఐసీ జడ్ఎం బాబ్జి, ఎల్డీఎం నీలాద్రి, నాబార్డ్ డీడీఎం అనిల్‌కాంత్, పీసీబీ ఈఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో నీళ్లు రాక పాట్లు



వాటర్ బాటిల్‌తో ఆస్పత్రి బయట నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న ఇన్‌పేషెంట్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 : ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నీళ్లు రాక రోగులు విలవిల్లాడుతూనే ఉన్నారు. తాగడానికి గుక్కెడు నీళ్లు రాలేదు. వినియోగించుకుపోవడానికి ఒక్క చుక్క నీరు కూడా లేకపోవడంతో తెలిసిన వారి సహకారంతో రోగి అటెండెంట్లు బయటకు వెళ్లి నీళ్లను తెచ్చుకుని వినియోగించారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. భారీ వాహనాలు లోపలకు వెళ్లడంతో ఆసుపత్రి ఆవరణలోని ఎఆర్‌టీ సెంటర్ సమీపంలో పైపులైను మంగళవారం రాత్రి పగిలిపోయింది. దానిని సిబ్బంది గుర్తించలేకపోయారు. బుధవారం ఉదయం నుంచి పంపుల్లో ఒక్క చుక్క నీరురాకపోవడంతో రోగులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి నరక యాతన పడ్డారు. ఇన్ పేషెంట్‌గా ఉన్న రోగులు ఆస్పత్రి బయటకు వచ్చి సమీపంలోని పంపుల నుంచి నీళ్లను బాటిళ్లతో, బక్కెట్లతో నీళ్లను పట్టుకుని వెళ్లారు. యుద్ధ ప్రాతిపదిక సత్వర చర్యలు చేపట్టాల్సి ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో రాత్రి వరకూ రోగులు నరకయాతన పడుతూనే ఉన్నారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో మరమ్మతుల ప్రక్రియ సిబ్బంది పూర్తి చేయగలిగారు. అయితే వాటర్ ట్యాంక్ నిండాలంటే 5 గంటలు పైబడి పడుతుందని గురువారం ఉదయానికి నీళ్ళు వార్డులలో ఉన్న పైపులకు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. అప్పటి వరకూ రోగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు మళ్ళీ తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని రోగులు కోరుతున్నారు.

## బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ అధికారులు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 : జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్‌గా ఎ.అవులయ్య బుధవారం ఏలూరు కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లా ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా కేవీ నాగ ప్రభు కుమార్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు ఆ శాఖ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ అవులయ్య



ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నాగ ప్రభుకుమార్

## జాతీయ స్కాలర్‌షిప్ టెస్టుకు దరఖాస్తు తుది గడువు 3 వరకు పొడిగింపు

ఏలూరు అర్బన్/భీమవరం ఎడ్యుకేషన్ : సెప్టెంబరు 25 : డిసెంబరు 8న జరుగనున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకునే తుదిగడువును అక్టోబరు 3 వరకు పొడిగించినట్టు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల డీఈవోలు అబ్రహం, నాగరాణి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రింటెడ్ నామినల్ రోల్స్, ఎస్‌బీఐ కలెక్ట్ రశీదు, స్కూల్ హెచ్ఎం లేఖను ఏలూరు డీఈవో కార్యాలయాల్లో అక్టోబరు 14 లోగా అందజేయాలని సూచించారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సరాదాయం రూ.3.50 వేలు లోపు ఉన్న విద్యార్థులు అందరూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులకు పరీక్ష రుసుం రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్ సైట్ www.bse.ap.gov.in లోగానీ లేదా జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో సంప్రదించాలని డీఈవో నాగమణి పేర్కొన్నారు.



ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ విజయభారతికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

## శ్రీవారి సేవలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 25: చినవెంకన్న ఆలయాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి బుధవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖమండపంలో ఈమెకు అర్చకులు స్వామివారి శేషవస్త్రం, వేదాశీర్వచనం అందించారు. శ్రీవారి చిత్రపటం, ప్రసాదాలను అందుకున్నారు.


## పలు రైళ్లు మళ్లింపు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 : ఏలూరు -తాడేపల్లిగూడెం మీదుగా వెళ్ళే పలు రైళ్లను విజయవాడ నుంచి గుడివాడ, భీమవరం జంక్షన్, నిడదవోలు మీదుగా మళ్ళిస్తున్నామని అదే విధంగా రాజమండ్రి వైపు నుంచి ఏలూరు- తాడేపల్లిగూడెం మీదుగా వెళ్లాల్సిన రైళ్లను నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ మీదుగా విజయవాడ వెళ్తాయని విజయవాడ సౌత్‌సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. రైల్ నెంబర్ 11019 ఛత్రపతి శివాజీ టెర్మినల్స్ - భువనేశ్వర్ ఈనెల 30వ తేదీ, వచ్చే నెల 2,4,5,7,9,11,12,14,16,18,19,21,23,25,26 తేదీలలో, ధన్‌బాగ్ -ఆల్‌పజ్(13351) ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబరు 27 వరకూ, టాటా- యశ్వంత్‌పూర్(18111) అక్టోబర్ 3, 10, 17, 24 తేదీలు, జాసిద్-తామ్రం(12376) అక్టోబరు 2, 9, 16, 23 తేదీలు ,అట్టాయ్ - యర్నాకుళం(22837) ఈనెల 30 అక్టోబరు 7, 14, 21 తేదీల్లో మళ్లించనున్నట్టు తెలిపారు.

## అథ్లెటిక్స్‌కు కైకరం నుంచి ఏడుగురు విద్యార్థుల ఎంపిక

ఉంగుటూరు, సెప్టెంబరు 25 : జిల్లా అథ్లెటిక్స్ అసోయేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో ఏడుగురు కైకరం హైస్కూలు విద్యార్థులు విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు తెలిపారు. కే.దీవెన కుమార్ (జావలిన్‌త్రో,లాంగ్ జంప్, షాట్‌పుట్, 60 మీటర్ల రన్నింగ్), జి.సందీప్ (రన్నింగ్, లాంగ్ జంప్, 600 మీటర్ల రన్నింగ్, సుభాష్, జి.యశ్వంత్, వై.ప్రేమ్ కుమార్ ఎం.ఆంజనేయస్వామి,బాలికల విభాగంలో మేరీ ఎంపికయ్యారని తెలిపారు. వీరు అక్టోబరు 3నుంచి 5వరకు రాజమహేంద్రవరంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

## ట్రిపుల్ ఐటీలో త్వరలో మెస్ టెండర్ల ఖరారు



విలేకర్లతో మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్

నూజివీడు టౌన్, సెప్టెంబరు 25: నూజివీడు ట్రిపుల్ ఐటీలో త్వరలో మెస్ టెండర్లను ఖరారు చేసి నూతన క్యాటరర్లకు మెస్‌లను అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నట్టు నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్ర కుమార్ చెప్పారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల నూజివీడు ట్రిపుల్ ఐటీలో నెలకొన్న మెస్ వివాదాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. దీంతో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 6 వేల మందికి భోజన సదుపాయాలు అందించే ముగ్గురు క్యాటరర్లలో ఇద్దర్ని తొలగించామన్నారు. కేవలం ఒక్కరే ఆరు వేల మందికి భోజనం అందిస్తున్నారని సమస్యల పరిష్కారానికి నూతన టెండర్లను పిలిచి అక్టోబరు 3వ తేదీ లోపు నూతన క్యాటరర్లకు బాధ్యతలు అప్పగిస్తామన్నారు.ఎన్నికల కోడ్ నేపథ్యంలో టెండర్లు పిలవకపోవడం వల్ల సమస్య వచ్చిందన్నారు. అకడమిక్ క్యాలెండర్ రూపకల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫుడ్ కోర్టు విషయంలో త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.ఏవో లక్ష్మణ్, పీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు రూ.కోటీ 52 లక్షల చెక్ అందిస్తున్న తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు, విద్యార్థినిలు

## సీఎం రిలీఫ్ ఫండ్‌కు తిరుమల విద్యాసంస్థల నుంచి రూ.1.52 కోట్లు విరాళం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 25 : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తన విద్యాసంస్థల నుంచి సీఎం సహాయ నిధికి రూ.కోటి 52 లక్షలను అందించారు. బుధవారం సీఎం చంద్రబాబును కలిసి చెక్ అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం తిరుమల విద్యాసంస్థల ఉద్యోగుల వేతనం నుంచి రూ.25,49,628, విద్యార్థులందరూ ఇచ్చిన రూ. 76,50,912 కలిపి మొత్తం రూ.కోటి రెండు లక్షలను సీఎంకు అందించారు. గతంలో రూ.50 లక్షలను అందించగా మొత్తం కోటి 52 లక్షలను సీఎం సహాయ నిధికి అందించారు. రెసిడెంట్ డైరెక్టర్లు కె.సత్యనారాయణ, ఎస్.సాయిరాజు, తదితరులు పాల్గొన్నారు.







జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులతో పెదవేగి గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ తదితరులు.. జిల్లా జట్టుకు ఎంపికైన అండర్-17 క్రీడాకారిణులు

# ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

### పెదవేగిలో బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

పెదవేగి, సెప్టెంబరు 25 : 14, 17 ఏళ్ల విభాగం ఉమ్మడి జిల్లాజట్లు ఎంపిక పెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో బుధవారం నిర్వహించారు. 14, 17 ఏళ్ల విభాగంలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 360 మంది హాజరయ్యారని, ప్రతిభ ఆధారంగా జిల్లా జట్లను ఎంపిక చేశామని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. వ్యాయామోపాధ్యాయులు కె.జయ రాజు, నరసింహరాజా, వి.వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, కె.విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### గొరగనమూడిలో నెట్‌బాల్ జట్ల ఎంపికలు

**పాలకోడేరు :** గొరగన మూడి స్వామి జ్ఞానానంద హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఉభయ గోదావరి జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్ -14, అండర్ 17 బాల,బాలికల నెట్‌బాల్ జట్ల ఎంపికలు బుధవారం జరిగాయి. నెట్‌బాల్ పోటీలను హెచ్ఎం శ్రీదేవి అధ్యక్షతన ఎంపీటీసీ కృష్ణకుమారి, ఎంఈవో శివన్నారాయణలు ప్రారంభించారు. 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ మల్లేశ్వరరావు, అసోసియేషన్ చైర్మన్ కృష్ణారెడ్డి, జిల్లా నెట్‌బాల్ సెక్రటరీ దావూద్‌ఖాన్, గొరగనమూడి హైస్కూల్ పీడీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### కస్తూరిబా స్కూల్లో బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

**ఏలూరు అర్బన్ :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) అండర్-14, 17 విభాగాల్లో బాలికల బాస్కెట్‌బాల్ జిల్లా క్రీడాజట్ల ఎంపికలు బుధవారం స్థానిక కస్తూరిబా మున్సిపల్ హైస్కూలులో జరిగాయి. ఒక్కో విభాగంలో నలుగురు స్టాండ్‌బై క్రీడాకారిణులతో సహా మొత్తం 16 మంది వంతున ఎంపికచేసినట్టు సెలక్షన్ కమిటీ ప్రతినిధులు వై.మురళీకృష్ణమ్మ, జి.శ్రీనివాసరావు తెలిపారు. అక్టోబరులో జరుగనున్న రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో జిల్లా తరపున ఈ జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు.

### రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్‌కు గణపవరం విద్యార్థిని



**గణపవరం :** రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గణప వరం జిల్లా పరిషత్ బాలు రున్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎం.హలణ్యకోమలి ఎంపికైనట్లు పీడీ ఎం.పద్మా వతి తెలిపారు. పెదవేగిలో బుధ వారం నిర్వహించిన పోటీల్లో హలణ్య కోమలి సెలక్షన్‌లో పాల్గొని అనంతపురంలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

## మద్యం దుకాణాల్లో 10 శాతం కేటాయింపుతో వృత్తి దారులకు ఉపాధి : పితాని

భీమవరం టౌన్, సెప్టెంబరు 25 : నూతన మద్యం విధానంలో భాగంగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 10 శాతం కల్లుగీత వృత్తిదారులకు కేటాయించిందని దీని అమలుకు ఎమ్మెల్యేలు పూర్తిగా సహకరించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయనున్నట్టు తెలిపారు. గీత వృత్తి దారుల ఉపాధి కల్పనకు ఇది దోహదపడుతుందని ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి బీసీ కులాలన్నీ రుణపడి ఉంటాయని చెప్పారు. భీమవరం మావుళ్ళమ్మ ఉత్సవ కమిటీ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా స్థాయి శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, కల్లుగీత వృత్తి దారుల సమాఖ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పితాని మాట్లాడుతూ భవిష్యత్తులో 50 వాటా సాధన కోసం వృత్తిదారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. 10 శాతం అమలయ్యే విధంగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కల్లుగీత వృత్తిదా రులకు డిపాజిట్‌ను 50 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో రాజమహేంద్రవరంలో జరిగిన వృత్తిదారుల సమావేశంలో మద్యం దుకాణాలు 50 కేటాయించాలని తీర్మానం చేశామన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 10 శాతం కేటాయించడం శుభపరిణామమన్నారు. శెట్టిబలిజ గౌడ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ నూతన మద్యం విధానంలో అందరికీ న్యాయం జరిగేలా చూడా లన్నారు. ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, జిల్లాలోని పలువురు శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, యాత, ఈడిగ కులాలకు చెందిన నాయకులు హాజరయ్యారు.



శనివారపుపేట సహకార సంఘంలో కంప్యూటరీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి (ఫైల్)

# సహకార సంఘాలకు.. మహర్దశ

- వేగవంతంగా సహకార సంఘాల కంప్యూటరీకరణ ప్రక్రియ
- జాతీయ నాబార్డ్ నెట్‌వర్క్‌తో జిల్లాలోని 158 పీఏసీఎస్‌లు అనుసంధానం

ఏలూరు సిటీ, సెప్టెంబరు 25 : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (సహకార సంఘాల్లో) కంప్యూటరీకరణ ప్రక్రియ త్వరిత గతిన కొనసాగుతోంది. జిల్లాలోని కంప్యూటరీకరణ ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాయి. జిల్లాలోని 159 పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణకు నిధులు మంజూరయ్యాయి. పోలవరం మండలం పైడిపాక పీఏసీఎస్ తప్ప మిగిలిన 158 సహకార సంఘాల్లో రికార్డుల కంప్యూటరీకరణ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు నిరంతర పర్యవేక్షణలో సహకార అధికారులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సిబ్బంది, పిఏసిఎస్‌ల సిబ్బంది యుద్ధప్రాతిపదికన సంఘాల రికార్డులు డిజిటలైజేషన్ చేయడంలో నిమగ్నమై ఉన్నారు. పూర్తి స్థాయిలో అక్టోబరు 2వ తేదీ (గాంధీ జయంతి రోజు) నుంచి కంప్యూటరీకరణ ద్వారా ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహించడానికి వీలుగా కృషి చేస్తున్నారు.

> **అక్టోబరు 2 నాటికి నూరుశాతం కంప్యూటరీకరణ**
>
> **ఎ.శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి**
>
> జిల్లాలోని 158 పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. అక్టోబరు 2వతేదీ నాటికి జిల్లాలోని సహకార సంఘాల్లో చేపట్టిన కంప్యూటరీకరణ పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. కంప్యూటరీకరణ పూర్తయితే ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయి. కంప్యూటరీకరణ ప్రక్రియను కలెక్టర్, జేసీ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అన్ని రికార్డులు కంప్యూటరీకరణ జరిగితే పారదర్శకత సాధ్యమవుతుంది.

### దుర్వినియోగాలకు అడ్డుకట్ట వేయవచ్చు

పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ వల్ల సహకార సంఘాల నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయవచ్చు. రైతులకు పారదర్శకంగా సేవలు అందించడానికి అవకాశం ఏర్పడుతుంది. కంప్యూటరీకరణలో భాగంగా ప్రతి పీఏసీఎస్‌కు ప్రభుత్వమే డెస్క్‌టాప్, వెబ్‌కామ్, మల్టీఫంక్షన్ డివైజ్ (ప్రింటర్) , ఫిజికల్ వీపీఎన్ డివైజ్, బయో మెట్రిక్ స్కానర్స్, ఇంటిగ్రేటెడ్ టాబ్లెట్ , యూపీఎస్, పీవోఎస్ మిషన్, బార్‌కోడ్ స్కానర్, బ్లూటూత్ థర్మల్ ప్రింటర్, పాస్ బుక్ ప్రింటర్ వంటి 11 రకాల హార్డ్‌వేర్‌లను సమకూరుస్తోంది. ఈ హార్డ్‌వేర్ ఐటమ్స్ ద్వారా డెస్క్‌టాప్, ఇంటిగ్రేటెడ్ టాబ్, పీవోఎస్ మిషన్ల ద్వారా మూడు రకాల బ్యాంకింగ్ టచ్ స్క్రీన్స్ ప్రతి పీఏసీఎస్‌కు అందుబాటు లోకి వస్తాయి. ప్రతీ రైతుకు అతని ఇంటి వద్దనే బ్యాంకింగ్ సేవలు అందించడా నికి ఈ టచ్‌స్క్రీన్స్ ఉపయోగపడతాయి. పారదర్శకత, జవాబుదారీతనం, ప్రధాన లక్ష్యాలుగా పీఏసీఎస్ సంఘాల్లోని సభ్యుల వివరాలను సంఘాల్లోని రికార్డులను డిజిటలైజేషన్ చేయడం వల్ల సంఘాల సభ్యులకు మరింతగా సేవలు అందించే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ కంప్యూటరీ కరణలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన చేబ్రోలు, శనివారపుపేట విశాల సహకార సంఘాలలో 95 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన సహకార సంఘాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది.

### 5,46,595 సభ్యుల వివరాలు డిజిటలైజేషన్ పూర్తి

సహకార సంఘాల కంప్యూటరీకరణలో భాగంగా జిల్లాలోని 158 పీఏసీఎస్‌లలోని 8,59,673 సభ్యుల ప్రొఫైల్స్‌కు సంబంధించి ఇప్పటి వరకు 5,46,595 సభ్యుల ప్రొఫైల్స్‌ను డిజిటలైజేషన్ చేశారు. ఇంకా 1,62,671 మంది సభ్యత్వ వివరాలు, 1,48,006 సభ్యుల భూముల వివరాలు, 95,174 మంది సభ్యుల డిపాజిట్ల వివ రాలు, 1,04,022 సభ్యుల రుణాల వివరాలు, 10,287 సభ్యుల పెట్టుబడుల వివరాలు, 26,435 ఖాతాల బ్యాంక్ అప్పుల వివరాలు ఇప్పటికే డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తయింది.ఈ డిజిటలైజేషన్ పురోగతి ప్రక్రియలో ఏలూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రతి పీఏసీఎస్ ఒక బ్యాంక్ వలె కోర్ బ్యాంకింగ్‌తో పనిచేస్తూ సభ్యులకు అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు అందించడానికి వీలవుతుంది.





చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న బైక్‌లు చూపుతున్న సీఐ, ఎస్సై

## బైక్ దొంగ అరెస్టు..13 బైక్‌లు స్వాధీనం

చాట్రాయి, సెప్టెంబరు 25: ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న కోట రవి (29)ని పోలీసులు అరెస్ట్ చేశారు. చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూజివీడు రూరల్ సీఐ కె. రామకృష్ణ, ఎస్సై డి. రామకృష్ణ వివరాలు వెల్లడించారు. చాట్రాయి మండలం పోలవరానికి చెందిన కోట రవి కొంత కాలంగా చోరీలకు పాల్పడుతున్నాడని, ఏలూరు పట్టణంలో 8 బైక్‌లు, చాట్రాయి పోలీస్ స్టేషన్ పరిధిలో 3 బైక్‌లు, ఒక మేకపోతు, ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఒక బైక్ చోరీ చేశాడన్నారు. మంగళవారం రాత్రి నిందితుడు రవిని అరెస్ట్ అతడు ఇచ్చిన సమాచారం మేరకు రూ. 5 లక్షలు విలువ చేసే 12 బైక్‌లు, నేరానికి ఉపయోగించిన మరో బైక్‌ను, ఒక మేకపోతును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మోటార్ సైకిళ్ళ రికవరీలో ప్రతిభ చూపిన ఎస్సై డి. రామకృష్ణ, హెచ్‌సి విజయ భాస్కర్, పీసీలు విష్ణుకుమార్, గిరిబాబును జిల్లా ఎస్పీ అభినందిస్తూ పంపిన క్యాష్ రివార్డులను సీఐ అందజేశారు. కాగా నిందితుడిని తిరువూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

## పంట కాల్వలో మృతదేహం గుర్తింపు

కైకలూరు, సెప్టెంబరు 25: పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం వివరాలు తెలిసినట్టు కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ తెలిపారు. ఈ నెల 21న కైకలూరు మండలం వింజరంలోని పోల్‌రాజ్ పంటకాలువ లాకుల వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు వీఆర్వో ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం శీర్షికన ఈ నెల 22న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్త ఆధారంగా మృతుడి కుమార్తె జ్యోతిర్మయి కైకలూరు టౌన్ పోలీసులను బుధవారం సంప్రదించింది. దీంతో పోలీసులు మార్చురీలోని మృతదేహాన్ని చూపించగా మృతుడి చేతివేళ్ళను చూసి ఆమె తండ్రిగా గుర్తించింది. మృతుడు తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు నక్కిన నాగభూషణం (47)గా గుర్తించారు. నాగభూషణం ఈ నెల 1న తెలంగాణాలో వివిధ గ్రామాల్లో తన బంధువుల ఇంటి వద్ద చేనేత పనికి వెళ్లాడు. మహబూబాబాద్ సమీపంలో రాళ్ళవాగు దాటుతుండగా నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. కృష్ణా నది ద్వారా కాలువల వెంబడి వింజరం వరకు మృతదేహం కొట్టుకువచ్చింది.

## ఏలూరు రూరల్ ఎస్ఐపై చర్యలకు సిఫార్సు

నూజివీడు, సెప్టెంబరు 25:పెండింగ్‌లో ఉన్న పలు క్రిమినల్ కేసుల్లో సాక్ష్యం ఇవ్వకుండా కోర్టుకు గైర్హాజరవుతున్న ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డిపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, ఏలూరు ఐజీ, ఎస్పీలకు బుధవారం సిఫార్సు చేశారు. గతంలో ముసునూరు ఎస్సైగా పనిచేసిన రాజారెడ్డి పలు కేసుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆ కేసులు ప్రస్తుతం విచారణ దశలో ఉండగా, ఎస్సై కోర్టుకు రాకుండా ఏదో ఒక కారణంతో గైర్హాజరవుతున్నారు.కోర్టు పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికి ఎస్సై కోర్టుకు రాకుండా వాయిదాలు అడుగుతుండటంతో విచారణ చివరి దశలో ఉన్న కేసులు ఎస్సై నిర్లక్ష్యం కారణంగా వాయిదా పడుతుండటంతో శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా న్యాయమూర్తి సిఫార్సు చేశారు.

## ఇది చెరువు కాదు.. రోడ్డే..

వర్షాకాలంలో ఈ రోడ్డు ఎప్పుడు చెరువునే తలపిస్తుంది. తంగెళ్లమూడి నేతాజీ నగర్ మినీ టవర్స్‌రోడ్డు ఇది. ఇటీవల కొంతకాలం నుంచి నిరంతరం కురుస్తున్న వర్షాలతో రోడ్డు జలమయంగా మారింది. వర్షపునీరుపోవడానికి ఇక్కడ డ్రైన్లులేవు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది నీళ్ళను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఎన్నో సార్లు మున్సిపల్ సిబ్బందికి, మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేసినప్పటికి మా గోడువినిపించుకోలేదు. రోడ్ల పై విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, పాదచారులు, వాహనదారులు, నడవటానికి తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. రోడ్ల పై గుంతలు ఉండటంతో నీళ్ళలో కనపడక గుంతల్లో పడిపోతున్నారు. మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- ఏలూరు టూ టౌన్**



**క్రైమ్ కార్నర్**

## సీబీఐ పోలీసులమని బెదిరించి తొమ్మిది లక్షలు లాగేశారు

### ఏలూరులో మోసపోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 :మీ నెంబర్ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారంటూ ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ.9 లక్షలు లాగేశారు.. బాధితుడు తేరుకుని ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మహ్మద్ రాహిల్ (29) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉన్నారు. బుధవారం అతనికి ఒక వ్యక్తి ఫోన్ చేసి తాము ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నామని చట్ట వ్యతిరేక కార్యకాలపాలకు పాల్పడుతున్నారంటూ బెదిరించాడు. కాల్‌ను మరో వ్యక్తికి ట్రాన్స్‌ఫర్ చేయగా తాము ముంబై సీబీఐ పోలీసులమని బెదిరించి రూ.9 లక్షల రూపాయలను బదిలీ చేయించుకున్నారు. తాము ముంబై సీబీఐ పోలీసులమని క్రైం బ్రాంచ్‌కు చెందిన వారమని ఆధార్ కార్డు, అతని వివరాలను చెప్పారు. భయపెట్టి రూ.9 లక్షల రూపాయలను కాన్పూర్ మార్కెట్ ఏరియాలోని సీఎస్‌బీఐ బ్యాంక్ అకౌంట్‌కు బదిలీ చేయించుకున్నారు. తాను మోసపోయానని గ్రహించి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అకౌంట్‌కు బదిలీ అయిన సొమ్మును తిరిగి రప్పించేందుకు సైబర్ సెల్ విభాగానికి సమాచారం ఇచ్చారు.

## లారీ ఢీకొని చెక్‌పోస్టు ఉద్యోగి మృతి

కాళ్ళ, సెప్టెంబరు 25 : లారీ ఢీకొని చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కాళ్ళ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కాళ్ళ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన సాలా వెంకటేశ్వరరావు (48) భీమవరం వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం కాళ్ళ మండలం పెద అమిరం పరిధిలో ఉన్న ఉండి మార్కెట్ యాడ్ చెక్ పోస్టులో విధులు నిర్వహిస్తుండగా రొయ్యలు లారీని ఎర్రజెండాతో ఆపే ప్రయత్నం చేశారు. సదరు వాహనం అతివేగంతో వెంకటేశ్వరరావుని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. భీమవరం ఆసుపత్రి తీసుకువెళ్ళగా మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు శ్రవణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళ్ళ ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆసుపత్రికి వెళ్లితే ఇంట్లో చొరబడి చోరీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 : ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వెళ్ళి తిరిగి వచ్చేసరికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరించుకుపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు ఆదివారపుపేటలోని రజకుల కాలనీలో నివాసం ఉంటున్న గోవాడ సురేష్ తన తండ్రి భద్రయ్యను బుధవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళారు. ఇంటికి తాళాలు వేశారు.ఆసుపత్రి నుంచి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని పది కాసుల బంగారు ఆభరణాలు, కొన్ని వెండి వస్తువులు, లక్ష రూపాయలు నగదు అపహరణకు గురయ్యాయి. సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## రాఘవాపురంలో సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

చింతలపూడి, సెప్టెంబరు 25 : చింతలపూడి మండలం రాఘ వాపురం సెంటర్‌లో చిమ్మపూడి నాగరాజు అనే వ్యక్తి ఇంట్లో బుధవారం తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో సిలిం డర్ పేలి అగ్నిప్రమాదం జరిగింది. ఇల్లు ధ్వంసం కాగా విలువైన ఫర్నీచర్ కాలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.సిలిండర్ పేలిన శబ్దానికి చుట్టుపక్కల గృహవాసులు లేచి చూసేసరికి డాబా ఇల్లు, ఫర్నీచర్ దగ్ధమవుతుండడంతో అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే గ్రామస్థులు మంటలను అదుపులోకితెచ్చి సిలిండర్‌ను బయటకు తీసుకువచ్చారు. అదనపు సిలిండర్ పేలిందని చెబుతున్నారు. నాగరాజు దంపతులు 20 రోజుల నుంచి జ్వరాల వలన కూతురు ఇంటికి తెలంగాణ రాష్ట్రం అచ్యు తాపురం వెళ్ళారు. ప్రమాదం సమాచారంతో ఉదయమే ఇల్లు చేరుకున్నారు. ప్రమాదంలో ఇల్లు ధ్వంసం కావడం చూసి అయోమయంలో పడ్డారు. దీంతో ఇంటిలోని విలువైనఫర్నీచర్, నగదు, బంగారం లక్షల్లో నష్టం ఉంటుందని చెబుతున్నారు. చింతలపూడి పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక అధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటల వల్ల సిలిండర్ అంటుకుని ప్రమాదం జరిగిందని భావిస్తున్నట్టు తెలిపారు. చింతలపూడి సీఐ రవీంద్రనాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## ఎక్సైజ్‌శాఖలో బదిలీలు

### ఏలూరు డిప్యూటీ కమిషనర్‌గా బి.శ్రీలత

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసి ఆ సిబ్బందిని తిరిగి మాతృ సంస్థ అయిన ఎక్సైజ్ శాఖకు బదిలీ చేస్తూ పోస్టింగులు కల్పించారు. దీంతో ఎక్సైజ్‌శాఖకు పూర్వవైభవం వచ్చినట్లు అయింది. దీంతో ప్రతి జిల్లాకు డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వంటి పోస్టులు తిరిగి ఆ శాఖలో వచ్చాయి. 14 మంది డిప్యూటీ కమిషనర్లను బదిలీలు చేశారు. ఏలూరు జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్‌గా కర్నూలు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీలతను నియమించారు. ఎక్సైజ్ శాఖలో పని చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగంలో 19 మందిని బదిలీలు చేశారు. ఏలూరు విజిలెన్సు అసిస్టెంట్ కమీషనర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖరరెడ్డిని కడప జిల్లాకు బదిలీ చేశారు. భీమవరం ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న నాగ ప్రభుకుమార్‌ను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్స్ మొత్తం 45 మందిని బదిలీలు చేశారు. ఏలూరు ఎస్ఈబీ ఇఎస్‌గా పనిచేస్తూ ఎస్ఈబీ రద్దు కావడంతో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న కె.రామకృష్ణను అల్లూరి జిల్లాకు బదిలీ చేశారు. ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్ఎస్ కుమారేశ్వరన్‌ను పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి బదిలీ చేశారు. కృష్ణా జిల్లా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బొలయ్యను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. ఏలూరులో ఉన్న ఏపీ ఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న దేవదత్తును బాపట్ల జిల్లాకు బదిలీ చేశారు. భీమవరం డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీ సర్‌గా పనిచేస్తున్న గౌరీశ్వరరావును ఏపీఎస్‌బీసీఎల్ డీఎంగా బదిలీ చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 25: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే చంటికి విన్నవించగా వెంటనే ఆయా సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీడీపీ నాయకులు చల్లా వెంకటసత్యప్రసాదరావు, ఎం.పార్థసారథి, మారం హనుమంతరావు, వందనాల శ్రీను, పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది జీతాల విడుదలకు చర్యలు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 25 : కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది జీతాల విడుదలకు చర్యలు తీసుకున్నామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు జె.సురేష్‌కుమార్ తెలిపారు. పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు విధుల్లో లేనందున అక్కడ పనిచేస్తున్న ఇతర సిబ్బంది జీతాల విడుదలకు అవరోధాలు లేకుండా తనకు డీడీవో బాధ్యతలను జిల్లా అధికారులు అప్పగించారని దీంతో జీతాలు చెల్లింపులకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

## చేబ్రోలులో స్వచ్ఛతా హీ సేవా



స్వచ్ఛతా హీ సేవాలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజు, తదితరులు

ఉంగుటూరు, సెప్టెంబరు 25 : ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మ రాజు సూచించారు. చేబ్రోలులో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, సర్పంచ్ రాందేలక్ష్మీ సునీత, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎస్.మాలతీరాణి, సర్పంచులు దిడ్ల అలకనంద, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించారు.

● ఏలూరు రూరల్ : జాలిపూడిలోని ఎంపీయూపీ స్కూల్లో దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం సత్యనారాయణ, జి.రూన్సీ తదితరులు పాల్గొన్నారు.

## పిసా గ్రామసభల ఉత్తర్వులను అమలు చేయాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 25 : ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 24 నుంచి అన్ని ఐటీడీఏల పరిధిలోని షెడ్యూల్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడానికి, పిసా గ్రామసభల పునరుద్ధరణకు ఉత్తర్వులు వచ్చాయని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ అన్నారు. అయితే ఏలూరు జిల్లా కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో పిసా గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడానికి ఆదేశాలు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. బుట్టాయగూడెంలో బుధవారం గిరిజన సంఘం సమావేశం జరగ్గా జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. పిసా గ్రామసభల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఉపాధి హామీ పనులపై అధికారుల ఆగ్రహం

ఉంగుటూరు,సెప్టెంబరు 25 : మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులు పక్కదారి పట్టినట్లు తనిఖీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సామాజిక తనిఖీలు బుధవారం నిర్వహించారు. డ్వామా పీడీ అక్కడే ఉన్న టెక్నికల్ అసిస్టెంట్, ఎఫ్ఏతో పాటు ఉపాధి హామీ ఏపీవో నాగేశ్వరరావు బాధ్యతగా నడుచుకోవడం లేదని గమనించి రికవరీ పెట్టారు. ఎంపీపీ జి.శ్రీలక్ష్మి, డిప్యూటీ జిల్లా అధికారిణి ఏవీ విజయలక్ష్మి, ఎంపీడీవో రాజ్ మనోజ్, ఎస్సార్పీలు, డీఆర్పీలు పాల్గొన్నారు.


## మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

పెదవేగి, సెప్టెంబరు 25 : వచ్చే ఏడాది మార్చినెలాకరులోగా నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నీ పూర్తి కావాలని పెదవేగి ఏఈ నాగరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అన్ని ఇళ్లు పూర్తిచేయాలని, దీనిపై ఈ నెల 28న ప్రతి గ్రామంలోనూ సమావేశాలు ఏర్పాటు చేసి, ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. సచివాలయ ఉద్యోగులు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎంఈవోలు సీహెచ్.బుధవాస్, వి.అరుణ్ కుమార్, ఏపీవో హేమలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## డ్రైవర్లకు ఇంక్రిమెంట్లు ఇవ్వండి

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 25: నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న పబ్లిక్ హెల్త్ డ్రైవర్లకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డీజోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు డిమాండ్ చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం అప్పలరాజు మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ వర్కర్లు 8మందికి డ్రైవర్లుగా రెండున్న సంవత్సరాల క్రితం ప్రమోషన్లు ఇచ్చారన్నారు. వారికి ఇంత వరకు ప్రమోషన్ ఇంక్రిమెంట్లు ఇవ్వలేదన్నారు. వెంటనే ప్రమోషన్ ఇచ్చిన నాటి నుంచి ఇంక్రిమెంట్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా సంక్రాంతి కానుక కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వెయ్యి రూపాయలు బోనస్ ఇస్తామని ప్రకటించారని అన్నారు. దాన్ని కూడా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అప్పారావు, శేఖర్, పీ.ప్రసాద్, వెంకటేశ్వరరావు, అప్పారావు, ఆంథోనిపాల్, గోవింద్ పాల్గొన్నారు.

## టీడీపీలోకి దొరసానిపాడు ఎంపీటీసీ



ఎమ్మెల్యే మద్దిపాటికి పుష్పగుచ్ఛాన్ని అందచేస్తున్న ఎంపీటీసీ అల్లాడ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 25: ఇప్పటికే పలువురు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరగా తాజాగా దొరసానిపాడు ఎంపీటీసీ సభ్యుడు అల్లాడ హరే రామకృష్ణ బుధవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నల్లజర్ల పార్టీ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేయగా పార్టీలోకి ఆహ్వానించారు. లంకా సత్తిపండు, కారుమంచి మురళి, బొబ్బిలి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 25: అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి అయినా సూపర్ సిక్స్‌లో ఏ ఒక్క పథకం అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షు రాలు షర్మిలారెడ్డి పిలుపుమేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. కంచాలను మ్రోగిస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీజిల్లా ఇన్‌చార్జి జి.సంజీవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆర్.రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాంటే భయమేస్తోందని సీఎం చంద్రబాబు అనటం ప్రజలను మోసం చేయటమే అన్నారు. జి.సత్యేంద్ర బాబు, ఎం.ప్రసాద్, ఎం.నరసిం హమూర్తి, ఎం.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 25: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, విద్యాశాఖ జిల్లాస్థాయి అధికారి ఏడీ షరీఫ్ అన్నారు. శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏలూరు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. అండర్-14 నుంచి 17 సంవత్సరాల బాలురకు వాలీబాల్, ఖోఖో, ఇతర ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఏలూరు మండల విద్యాశాఖ అధికారి మోహన్, రంగయ్య, అల్లూరి రవిప్రకాష్, పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్, కోఆర్డినేటర్ పద్మలత, పీడీ పీఈటీలు రమేష్, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ పునరుద్ధరించాలని ధర్నా

ఏలూరు రూరల్, సెప్టెంబరు 25: ఎన్నో సంవత్సరాలుగా పింఛన్ అందుకుంటున్న తమకు రెండు నెలల నుంచి ఇవ్వడం లేదని, తక్షణం పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దెందులూరు నియోజకవర్గంలోని మొండూరు గ్రామానికి చెందిన పలువురు పింఛనుదారులు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎ.నరసింహమూర్తి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. చెప్పులు కుట్టేవారు, డప్పు కళాకారులు, దివ్యాంగులు సుమారు 40 మంది పింఛన్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కె.బోగయ్య, మధు, నాగసూరి దుర్గారావు, తానేటి సుబ్బయ్య, జాన్‌మారియో, కొలిమూరి జగ్గయ్య, వెంకట్రావు, సొంగా నాగరాజు, పకీర్ తదితరులు పాల్గొన్నారు.



పోతునూరులో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి



ప్రభుత్వం చేసిన పనులు వివరిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి



లింగపాలెంలో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సొంగా



భీమడోలులో సేంద్రీయ కూరగాయలను అందజేస్తున్న మహిళలు

# సైనికుల్లా పని చేశారు

» వరద బాధితులను ఆదుకోవడంలో అద్భుతంగా పని చేశారు » కలెక్టర్ వెట్రిసెల్వి

దెందులూరు, సెప్టెంబరు 25 : అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. పోతునూరు స్వరాజ్ భవన్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌రావు, జనసేన నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మీ, కూటమి నాయకుల అధ్యక్షత ఆర్డీవో ఖాజావళి, పార్టీ నాయకులు కొత్త సాంబ శివరావు, నున్న లక్ష్మణ్‌బాబు, బోడేటి మోహన్ బాబు, తదితరులతో కలిసి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సమర్ధవంతమైన సిబ్బంది ఉండడం వలనే తుపాను విపత్తులో సైనికుల్లా పని చేశారన్నారు.

ఎమ్మెల్యే చింతమనేని దగ్గరుండి అధికారులను సమన్వయం చేసి ప్రజల ఇబ్బందుల పరిష్కారానికి జోరు వర్షంలోను బురద లోను, వాగుల్లోను సహాయక చర్యలు తీసుకునే విధంగా మంచి నాయకుడు అనిపించుకున్నారన్నారు. అనంతరం వంద రోజుల్లో ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ జిల్లా రథసారధిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని కృషి చేస్తూ కలెక్టర్ ప్రజలందరి మన్ననలను పొందారన్నారు. మండలంతో పాటు పోతునూరు గ్రామంలో సమస్యలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి మిల్లు బాబు, మోతుకూరి నాని, డాక్టర్ పసుమర్తి మధుబాబు, బాయి రాంప్రసాద్, నాగనబోయిన సత్యనారాయణ, గారపాటి కొండయ్య చౌదరి, యిప్పిలి వెంకటేశ్వ రరావు, నేతల రవి, బోప్పన సుధా, తాతా సత్యనారా యణ, కలపాల చంద్రశేఖర్, డోక్కు వెంకటేశ్వరరావు, తలారి ధన్యకుమార్, కమ్మ శివరామ కృష్ణ, కూటమి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పోతునూరు, ఉండ్రాజవరం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, చింతమనేని వరి పొలాలను పరిశీలించారు.

● ఏలూరు టూ టౌన్ : అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం 15వ డివిజన్ జాలా పరమేశ్వర కాలనీలో జరిగింది. ఎమ్మెల్యే చంటి ఇంటింటికి వెళ్లి వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచి పనులను వివరించారు. నియోజకవర్గ పరిశీలకులు షేక్ మీర, టీడీపీ నగర అధ్యక్షులు పి.శివప్రసాద్, జనసేన అధ్యక్షులు కాశీనరేష్, బీజేపీ అధ్యక్షులు జి.రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డి.ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం : అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందిస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తామని, చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఇది మంచిప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా వలసపల్లి నుంచి ధర్మాజీగూడెం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో రోషన్‌కుమార్ మాట్లాడారు. వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రయాణికులకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ధర్మాజిగూడెంలో ప్రతి ఇంటికి తిరుగుతూ మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు జి.చలపతిరావు, జి.బుజ్జియ్య, సీహెచ్.రామ్మోహన్‌రావు, ఎం.ప్రసాద్, వెంకటేశ్వరరావు, మురళీ, శ్రీను, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

● కుక్కునూరు : చంద్రబాబుతో అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. కుక్కునూరులో ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు కె.సత్యనారాయణ, పి.శ్రీను, జనసేన మండల అధ్యక్షులు ఎం.యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, ఎం.వెంకన్నబాబు, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

● చింతలపూడి : ప్రగడవరం, ఉర్లగూడెం పంచాయతీలలో కూటమి నాయకులు ఇంటింటా వాల్‌పోస్టర్లు అంటించి ప్రజలకు కరపత్రాలు అందచేశారు. ప్రగడవరంలో టీడీపీ నాయకులు టి.చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీ మా జీ సభ్యులు రాజారెడ్డి, ఉర్లగూడెంలో సర్పంచ్ కె.యువరాజు, ఎన్.నాగేశ్వ రరావు, పలువురు పాల్గొన్నారు.

● పెదపాడు : వరి పంటలో పొడతెగులు అధికంగా ఉందని, సకాలంలో గుర్తించి తెగులు నివారణ చర్యలు చేపట్టాలని ఏవో వి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు, వీరమ్మకుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్ర మం నిర్వహించారు. నీటి సంఘం మాజీ అధ్యక్షుడు బి.కాశీబాబు, సర్పంచ్ ఎం.సోమేశ్వరరావు, ఎం.రవి, కోటేశ్వరరావు, ఎం.నాగబాబు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : వ్యవసాయ శాఖ పద్ధతులను రైతులంతా పాటిస్తే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని ఏవో జీవన్‌సంధ్య అన్నారు. రూరల్ మండలం మల్కాపురంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు వ్యవసాయ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పద్ధతులను వివరించారు. జీవామృతం తయారీ విధానం చేసి చూపించి దానివల్ల పంట ఉపయోగాలను వివరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : ఏడు, ఎనిమిది సచివాలయాల పరిధిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ అధ్యక్షతన జరిగింది. సీనియర్ నాయకుడు ఎం.లక్ష్మణ రావు మున్సిపల్ కమిష నర్ జె.నరేంద్రకుమార్, కౌన్సిలర్లు ఎన్.రామచంద్రరాజు, వి.తాతాజీ, కూటమి నాయకులు వి.శ్రీనివాస్, పి.రామలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా పండిట్ దీన్ దయాళ్ జయంతి



ఉంగుటూరులో దీన్ దయాళ్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న గారపాటి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 25: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు దొండపాడులోని పరివర్తన్ బదిరుల పాఠశాలలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కో ఆర్డినేటర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, డీడీఎస్‌ఈ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దాన భాస్కర్‌రావు, రాంబాబు, కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

● ఉంగుటూరు : దీన్ దయాళ్ ఉపాధ్యాయ నిరుపేదలకు ఇచ్చిన అంత్యోదయ పథకం కోట్లాది కుటుంబాలకు అసరాగా నిలిచిందని రాష్ట్ర బీజేపీ కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ఉంగుటూరులో గ్రీన్ ఆసియా ఇంపెక్స్ ప్రైవేటు సంస్థ అధినేత పి.వెంకట రామారావు సౌజన్యంతో ఆ కంపెనీ వద్ద చెవిటి వ్యాధితో బాధపడుతున్న సుమారు వంద మందికి వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ బి.సింధు మధు, ఉంగుటూరు, తణుకు, తాడేపల్లిగూడెం, అనపర్తి ఎమ్మెల్యే లు పత్సమట్ల ధర్మరాజు, ఆరుమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, శరణాల మాలతీరాణి, సర్పంచులు దిడ్ల అలకనంద, కూటమి శ్రేణులు పాల్గొన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించారు.

● జంగారెడ్డిగూడెం : పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎం.రామారావు, టి.సుధాకర్,వేమూరి శ్రీనివాస్, పీవీ రామలక్ష్మి, పి.రాధాకృష్ణ మూర్తి, ఎ.రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## లాభసాటి సాగు దిశగా ప్రభుత్వం చర్యలు



పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

పెదవేగి, సెప్టెంబరు 25 : రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అనువుగా లాభసాటి సాగు దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జిల్లా వ్యవసా యాధికారి ఎస్కే.హబీబ్ భాషా అన్నారు. వేగివాడ, ముందూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న హబీబ్ భాషా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. వేగివాడ సర్పంచ్ పి. ప్రభావతి సూర్యచంద్రరావు, ఏడీలు, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : రైతులు ప్రస్తుత సీజన్‌లో సస్య రక్షణతో పాటు వరిపై యాజమాన్య విధానాలను మండల వ్యవసాయాధికారి ఎస్.ఎస్.ప్రవీణ్ కుమార్ వివరించారు. రావులపర్రు, కాగుపాడు గ్రామాలలో జరిగిన పొలం బడి కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులతో మమేకమయ్యారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

● లింగపాలెం : ధర్మాజీగూడెం, అయ్యప్పరాజుగూడెం గ్రామాల్లో ఏవో కె.మురళీకృష్ణ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు మెళుకువలను తెలియచేయాలని అన్నారు. హార్టికల్చర్ అధికారిణి సాఫియా పరిహీన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● భీమడోలు : గ్రామంలో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఏడీఏ ఉషారాజకుమారి, ఏఈ ఉషారాణితో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా మండల వ్యవసాయాధికారి కె.గంగాధరం రైతులతో అంకన్నగూడెం, రాచన్నగూడెం ఆర్ఎస్‌కేల వద్ద సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టం నమోదు వివరాలు తెలిపారు. హెచ్‌వో నవీన, ఎంటీ ధర్మరాజు, నాగేశ్వరావు, ప్రశాంత్‌కుమార్, పాటేశ్వరీ, నాగలక్ష్మీ ఉన్నారు.

## వరద బాధితులకు సాయం



ఎమ్మెల్యేకి చెక్కు అందజేస్తున్న ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం

లింగపాలెం, సెప్టెంబరు 25:వరద బాధితులకు తమవంతు సాయం అందజేస్తున్నట్లు చింతలపూడి జోన్ ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం తెలిపారు. ధర్మాజీగూడెంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు సీఎం సహాయనిధికి రూ.లక్షా ఐదు వేల నగదును చెక్కు రూపంలో అందజేశారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం, ఏలూరు జిల్లా అధ్యక్షుడు శివకుమార్, చింతలపూడి జోన్ ప్రసిడెంట్ రాంబాబు, చక్రధర్‌రావు, పవన్‌కుమార్, సీహెచ్.రత్నాకర్, పాపారావు, రాఘవరాజు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ భూములు పంచాలి

టి.నరసాపురం, సెప్టెంబరు 25: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ భూములు పంచాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు. మండలంలోని అల్లంచర్లరాజుపాలెం పంచాయతీలో వివాదస్పద భూమిని బుధవారం సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లంచర్ల పరిధిలో సుమారు 1500 ఎకరాల రెవెన్యూ భూమి ఉందన్నారు. ఆ భూమిని పేదలకు పంపిణీ చేయాల న్నారు.

## రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సర్వే

భీమడోలు, సెప్టెంబర్ 25 : భీమడోలు రైల్వే గేటు సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక సర్వేను అధికారులు బుధవారం చేపట్టారు. పూళ్ళ, భీమడోలు రైల్వే గేటు ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం భూ సేకరణ చేయాల్సిందిగా నోటిఫికేషన్ ఇవ్వడంతో పూళ్ళ రైల్వే అధికారులు సంబంధిత శాఖలతో గతంలో ప్రతిపాదించిన స్థలాల ను పరిశీలించారు. రైల్వే ప్లానింగ్ జూనియర్ ఇంజనీర్ సాయికుమార్, శ్రీకాంత్, ఆర్ అండ్ బీ ఈఈ కిషోర్ బాలాజీ, డీఈ గోవిందమోహన్, విద్యుత్‌శాఖ ఏడీఏ గోపాలకృష్ణ, ఏఈ రామస్వామి, సర్వేయర్ ధర్మారావు, తహసీల్దార్ రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

## హిందువుల మనోభావాల మీద దెబ్బకొట్టారు : కరాటం



కె.రాంబాబు

కొయ్యలగూడెం, సెప్టెంబరు 25: తిరుపతి లడ్డూ విషయంలో హిందువుల మనోభావాలతో పాటు ప్రజల ఆరోగ్యం మీద కూడా దెబ్బకొట్టారని మాజీ డీసీసీబీ ఛైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ తిరుపతి లడ్డూ ఎంతో పవిత్రమైందని అంతేకాకుండా దానిలో కలిపే ఆవు నెయ్యి, పచ్చకర్పూరం ఎంతో ఆరోగ్యకరమైనవని అటువంటి లడ్డూ కల్తీ జరగటం దారుణమన్నారు. దీనికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

## గుర్తు తెలియని వ్యక్తులతో జర భద్రం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 : సోషల్ మీడియా మాధ్యమాల్లో గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని ఏలూరు జిల్లా సైబర్ సెల్ ఎస్ఐ మధువెంకటరాజా సూచించారు. ఏలూరు కోటదిబ్బపై ఉన్న గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ రాజా మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలకు ఎవ్వరు గురి కావద్దన్నారు. ఎవరైనా మోసాలకు గురైతే వెంటనే 1930కు సమాచారం ఇచ్చి పోలీసుల సహాయాన్ని పొందాలన్నారు.

## మహిళా ఉద్యోగులకు వసతులు కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 : మహిళా ఉద్యోగులు పనిచేసే అన్ని కార్యాలయాల్లో వారికి కనీస వసతులు ఏర్పాటు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి పురుషోత్తమ కుమార్ ఆధ్వర్యంలో ఏలూరులోని న్యాయస్థానాల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు బుధవారం డీఎల్ఎస్ఏ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వారు పని చేస్తున్న కార్యాలయాల్లో ఎదురవుతున్న సమస్యలు అధిగమించడానికి ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాల న్నారు. ఆ కమిటీలో ఉన్న వారి పేర్లను కార్యాలయంలో బోర్డులో ప్రదర్శించా లన్నారు. కలెక్టర్ ఈ కమిటీకి ఛైర్మన్‌గా ఉంటార న్నారు. మూడవ అదనపు జిల్లా జడ్జి మహ్మద్ అబూబ్ తాలీబ్ ఎర్రీజోషెక్, సీనియర్ న్యాయవాది కె.కృష్ణా రావు, జిల్లా వినియోగదారుల కమిషన్ నెంబర్ కేఎస్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : మహిళలు పనిచేసే చోట అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయడమే కాకుండా మహిళలకు భద్రత కల్పించాలని జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.కిషోర్‌కుమార్ సూచించారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్ తేజస్వీ మాట్లాడుతూ మహిళలు పని చేసే చోట ఏమైనా సమస్యలు ఎదురైతే వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. కోర్టు సూపరిండెంటెంట్ స్వరూప రాణి, కోర్టు సిబ్బంది, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## 'బొరగం'ను కలిసిన టీడీపీ నేతలు



సెక్రటేరియట్‌లో శ్రీనివాసులును సన్మానించిన టీడీపీ నేతలు

టి.నరసాపురం, సెప్టెంబరు 25: ఏపీ ట్రైకార్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన బొరగం శ్రీనివాసులని బుధవారం మండల టీడీపీ నాయకులు ఏపీ సచివాలయంలో సన్మానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, తెలుగురైతు సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వానిరెడ్డి రామ్మోహన్, పలువురు టీడీపీ నాయకులు, ఏపీ సచివాలయంలో బొరగాన్ని కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు. ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేసిన బొరగానికి చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారన్నారు. జోనుబోయిన సోంబాబు, కాల్నీడి రాంబాబు, సందేపూడి సాయి, మోదుగు రామారావు తదితరులు ఉన్నారు.

## ఎస్పీ బాలు పాటల పోటీల విజేతలకు ప్రశంసలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 25 : ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 4వ వర్ధంతి, ఉన్నవ లక్ష్మీనారాయణ 66వ వర్ధంతిని పురస్కరించుకుని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవ్, హేలాపురి సింగర్స్ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సాహిత్య మండలి భవన్‌లో బాలు పాటల స్వరాంజలి, సందేశాత్మక పాటల పోటీలు జరిగాయి. విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

## 28న మనం ఇల్లు-మన గౌరవం

జీలుగుమిల్లి, సెప్టెంబరు 25 : మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద డీఎల్‌పీవో ఎండీ రజావుల్లా అధికారులతో సమీక్షించారు. 28న మండల వ్యాప్తంగా పంచాయతీల్లో సమావే శాలు ఏర్పాటు చేసి గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన

పెదపాడు, సెప్టెంబరు 25 : వట్లూరులోని సర్ సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మెషీన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఐ ప్రాముఖ్యత, భవిష్యత్తులో దాని పాత్రను వివరించారు. అనంతరం కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విదేశాల్లో విద్యను పొందడానికి అవసరమైన విద్యార్హతలు, అర్హత పరీక్షల గురించి అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరళ పాల్గొన్నారు.

## పని విషయంలో అప్రమత్తంగా ఉండాలి

లింగపాలెం, సెప్టెంబరు 25: అధికారులు భూమి రికార్డుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏలూరు ఆర్డీవో, ఫ్రీహోల్డ్ భూముల తనిఖీ అధికారి ఎస్కె ఖాజావలీ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అసైన్డ్ ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి పలు పత్రాలు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ నజీముల్లాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 : గంజాయి కల్గి ఉన్న ఇద్దరు వ్యక్తులను ఏలూరు త్రిటౌన్ సీఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో అరెస్టు చేశారు. ఆకివీడునకు చెందిన నక్కా మహేష్ (23), రాజమహేంద్రవరంలోని గోక వరానికి చెందిన బండి రాజు అలియాస్ పండులు (23) పోలీస్ వాహనాన్ని చూసి పారిపోతుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పరి శీలించగా వారి వద్ద రెండు కేజీల 160 గ్రాముల గంజాయి ఉండడంతో అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు గతంలో కూడా గంజాయిని ఏలూరు నగరానికి తెచ్చి విక్రయిస్తున్నట్లు కేసులు ఉన్నట్లు గుర్తించారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి ఏలూరులో విక్రయిస్తున్నట్లు చెప్తున్నారు.

## లోడు దింపుతున్న కార్మికునికి తీవ్ర గాయాలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 25: శేషాచలంపై నూతనంగా నిర్మిస్తున్న వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద మార్బుల్ లోడ్‌ను దించుతున్న కార్మికుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. రాయిని కిందికి దింపుతున్న సమయంలో ఎగువనున్న రాళ్లు జారి ద్వారకాతిరుమలకు చెందిన జక్కుల అంజిబాబు మీద ఒక్కసారిగా పడ్డాయి. దీంతో అతని కాళ్లు నలిగిపోయాయి. సెక్యూరిటీ, ఇతర కార్మికులు అతడిని అంబులెన్స్‌లో ఏలూరు ఆస్పత్రికి తరలించారు.

## సంక్షిప్త సమాచారం..

- **ద్వారకాతిరుమల :** పర్యావరణ పరిరక్షణకు సమాజంలో ప్రతీ వ్యక్తీ కంకణబద్ధులై ఉండాలని కోరుతూ చినవెంకన్న దేవస్థానం సంస్కృత పాఠశాల విదార్థులు, ఉపాధ్యాయులు ద్వారకాతిరుమలలో భారీ ర్యాలీ నిర్వహించారు.
- **చింతలపూడి:** ఏలూరు జిల్లాలో జరిగిన జిల్లా అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో బెస్ట్ అథ్లెటిక్స్‌గా నిలిచి న ఎర్రంపల్లికి చెందిన హోంగార్డు సూరిబాబు కుమారుడు ప్రణీత్‌ను ఉపా ధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.
- మండలంలోని వరి పంటకు ఎండు తెగులు వ్యాపించిందని రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం సైంటిస్ట్ కె.ఫణికుమార్, ఏవో కె.మీనాకుమారి తెలిపారు.
- **బుట్టాయగూడెం :** బుట్టాయగూడెం ఎంపీడీవోగా కె.జ్యోతి నియమితుల య్యారు. ఈమె పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం నుంచి బుట్టాయ గూడెం మండలానికి వస్తుండగా ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.
- **దెందులూరు :** కొవ్వలి వేంకటేశ్వర ఆలయంలో ప్రాయశ్చిత దీక్ష చేస్తున్న జనసేన కూటమి నాయకులకు బీజేపీ దెందులూరు అసెంబ్లీ కన్వీనర్ గుమ్మ డి వెంకటచైతన్య కృష్ణతో కలిసి జనసేన రాష్ట్ర పార్టీ కార్యదర్శి జి.వెంకటలక్ష్మీ దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు.
- **లింగపాలెం :** ఎంపీడీవోగా కె.వాణి బాధ్యతలు స్వీకరించారు. ఆకివీడు మండలం నుంచి బదిలీపై లింగపాలెం వచ్చినట్లు ఆమె తెలిపారు.
- **ఏలూరు అర్బన్ :** 'వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో కమ్యూని కేషన్ పాత్ర' అనే అంశంపై బుధవారం స్థానిక సీఆర్ఆర్ కళాశాలలో అతిథి ఉప న్యాస కార్యక్రమం జరిగింది. రిసోర్స్ పర్సన్‌గా హాజరైన బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సరళమైన భాష, భావ వ్యక్తీకరణ జీవితంలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు.
- తంగెళ్లమూడి కబడ్డీగూడెం ప్రజలకు దోమల ద్వారా వచ్చే వ్యాధులపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు పాల్గొన్నారు.
- జడ్పీ పీఎఫ్ నుంచి పాక్షిక ఉపసంహరణకు ఇప్పటివరకు అమల్లో ఉన్న పరిమితులను పెంచాలని జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారావుకు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసరావు వినతిపత్రాన్ని అందజేశారు.
- **ఏలూరు రూరల్ :** మాదేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని దెందులూ రు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు ఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనే యులు వినతిపత్రం అందచేశారు.
- **జీలుగుమిల్లి :** జగదాంబ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం లెక్కించగా 14 నెలలకు రూ.3 లక్షల 86 వేల 663 లు వచ్చినట్లు ఎండో మెంట్ కార్యనిర్వహణ అధికారులు ఎంఎస్ సంఘమేశ్వరశర్మ, ఎం.రాంబాబు తెలిపారు.
- **పెదపాడు :** రాజుపేటలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థా నంకు చెందిన 7.97 ఎకరాల వ్యవసాయ భూమి కౌలు సాగుకు బహిరంగ వేలం నిర్వహించగా జి.యుగంధర్ దక్కించుకున్నారని అర్చక సింగిల్ ట్రస్టీ గూడురు రామ లింగేశ్వరరావు తెలిపారు.
- **జంగారెడ్డిగూడెం :** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ జెడ్పీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు తండ్రి ఇటీవల మృతి చెందారు. నల్లజర్ల లోని బాపిరాజును ఇంటి వద్ద చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పరామర్శించారు.
- జంగారెడ్డిగూడెం కోర్టుకు నూతన భవనాలను,సీనియర్ సివిల్ కోర్టు మంజూ రు చేయాలని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం చింతలపూడి ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు.

## ఎక్సైజ్ శాఖలో బదిలీలు

### ఏలూరు డిప్యూటీ కమిషనర్‌గా బి.శ్రీలత

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ)ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసి ఆ సిబ్బందిని తిరిగి మాతృ సంస్థ అయిన ఎక్సైజ్ శాఖకు బదిలీ చేస్తూ పోస్టింగులు కల్పించారు. దీంతో ఎక్సైజ్‌శాఖకు పూర్వవైభవం వచ్చినట్లు అయింది. దీంతో ప్రతి జిల్లాకు డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వంటి పోస్టులు తిరిగి ఆ శాఖలో వచ్చాయి. 14 మంది డిప్యూటీ కమిషనర్లను బదిలీలు చేశారు. ఏలూరు జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్‌గా కర్నూలు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీలతను నియమించారు. ఎక్సైజ్ శాఖలో పని చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగంలో 19 మందిని బదిలీలు చేశారు. ఏలూరు విజిలెన్సు అసిస్టెంట్ కమీషనర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డిని కడప జిల్లాకు బదిలీ చేశారు. భీమవరం ఎస్‌ఈబీ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న నాగ ప్రభుకుమార్‌ను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. ప్రొహి బిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్స్ మొత్తం 45 మందిని బదిలీలు చేశారు. ఏలూరు ఎస్‌ఈబీ ఇఎస్‌గా పనిచేస్తూ ఎస్‌ఈబీ రద్దు కావడంతో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న కె.రామకృష్ణను అల్లూరి జిల్లాకు బదిలీ చేశారు. ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్ఎస్ కుమారేశ్వరన్‌ను పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి బదిలీ చేశారు. కృష్ణా జిల్లా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఔలయ్యను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. ఏలూరులో ఉన్న ఏపీ ఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న దేవదత్తును బాపట్ల జిల్లాకు బదిలీ చేశారు. భీమవరం డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీ సర్‌గా పనిచేస్తున్న గౌరీశ్వరరావును ఏపీఎస్‌బీసీఎల్ డీఎంగా బదిలీ చేశారు.

## పలు రైళ్ల మళ్లింపు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 : ఏలూరు -తాడేపల్లిగూడెం మీదుగా వెళ్ళే పలు రైళ్లను విజయవాడ నుంచి గుడివాడ, భీమవరం జంక్షన్, నిడదవోలు మీదుగా మళ్ళిస్తున్నామని అదే విధంగా రాజమండ్రి వైపు నుంచి ఏలూరు-తాడేపల్లిగూడెం మీదుగా వెళ్లాల్సిన రైళ్లను నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ మీదుగా విజయ వాడ వెళ్తాయని విజయవాడ సౌత్‌సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. రైల్ నెంబర్ 11019 ఛత్రపతి శివాజీ టెర్మినల్స్ - భువనేశ్వర్ ఈనెల 30వ తేదీ, వచ్చే నెల 2,4,5,7,9,11,12,14,16,18,19, 21,23, 25,26 తేదీలలో, ధన్‌బాగ్ -ఆల్‌పజ్(13351) ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబరు 27 వరకూ, టాటా- యశ్వంత్‌పూర్(18111) అక్టో బర్ 3, 10, 17, 24 తేదీలు, జాసిద్-తాంబ్రం(12376) అక్టోబరు 2, 9, 16, 23 తేదీలు, అట్రాయ్ - యర్నాకుళం(22837) ఈనెల 30 అక్టోబరు 7,14,21 తేదీల్లో మళ్లించనున్నట్లు తెలిపారు.

## ఏలూరు రూరల్ ఎస్‌ఐపై చర్యలకు సిఫార్సు

నూజివీడు, సెప్టెంబరు 25:పెండింగ్‌లో ఉన్న పలు క్రిమినల్ కేసుల్లో సాక్ష్యం ఇవ్వకుండా కోర్టుకు గైర్హాజరవుతున్న ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డిపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, ఏలూరు ఐజీ, ఎస్పీలకు బుధవారం సిఫార్సు చేశారు. గతంలో ముసునూరు ఎస్సైగా పనిచేసిన రాజారెడ్డి పలు కేసుల్లో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఆ కేసులు ప్రస్తుతం విచారణ దశలో ఉండగా, ఎస్సై కోర్టుకు రాకుండా ఏదో ఒక కారణంతో గైర్హాజరవుతున్నారు. ఈ సందర్భంగా కోర్టు పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికి ఎస్సై కోర్టుకు రాకుండా వాయిదాలు అడుగుతుండటంతో విచారణ చివరి దశలో ఉన్న కేసులు ఎస్సై నిర్లక్ష్యం కారణంగా వాయిదా పడుతుండటంతో అతనిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా న్యాయమూర్తి ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు.

## పెదపాలపర్రు పీఏసీఎస్‌లో...

## సమస్యలపై గళం విప్పిన రైతులు

ముదినేపల్లి, సెప్టెంబరు 25 : ముదినేపల్లి మండలం పెదపాలపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సమస్యలపై రైతులు, కౌలు రైతులు గళం విప్పారు. బుధవారం ఆ సంఘ పీఐసీ, ఏలూరు డివిజనల్ సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వీవీ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో సంఘ కార్యదర్శి మల్లీశ్వరిపై పలు ఆరోపణలు చేశారు. సంఘం ద్వారా ధాన్యం అమ్మిన పలువురు రైతులు, కౌలు రైతులకు నేటికీ సొమ్ములు అందలేదని, మరణించిన సంఘ సభ్యులైన రైతులకు అంత్యక్రియల సొమ్ములు ఇవ్వటం లేదని, ధాన్యం అమ్మకాలకు గోనె సంచుల నిధులను రైతుల ఖాతాలకు జమ చేయలేదని, రుణాల కోసం వచ్చిన రైతుల నుంచి పాస్ పుస్తకాలు, భూముల దస్తావేజులు తీసుకుని కూడా రుణాలు మంజూరు చేయకుండా సంఘ కార్యదర్శి జాప్యం చేస్తున్నారని, రుణాలు చెల్లించిన వారికి పాస్ పుస్తకాలు, డాక్యుమెంట్లు తిరిగివ్వటం లేదని రైతులు ఆరోపించారు. తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటానని పీఐసీ నాగేశ్వరరావు సభ్యులకు హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు చల్లగుళ్ల ఆదిత్య, సర్పంచ్ గంటా రాకేష్, ఉప సర్పంచ్ గన్నమనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఎల్‌టి రుణాలు, డివిడెండ్లు ఇప్పించాలని తెలుగు రైతు నాయకుడు ఎలిశెట్టి లక్ష్మీనరసింహారావు కోరారు.

## నేటి నుంచి క్రీడాకారుల ఎంపిక

ముదినేపల్లి, సెప్టెంబరు 25 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ముదినేపల్లి మండల స్థాయిలో క్రీడాకారుల ఎంపికకు ఆటల పోటీలను నిర్వహించాలని ఫెడరేషన్ నిర్ణయించింది. బుధవారం స్థానిక మండల రిసోర్స్ సెంటర్‌లో ఎంఈవో కె.నరేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఫెడరేషన్ సభ్యులైన హైస్కూళ్ల పీడీల సమావేశంలో క్రీడల నిర్వహణపై చర్చించారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో అండర్-14, 17 బాలుర, బాలికల విభాగాల్లో విద్యార్థులకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగాల్లో క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. ముదినేపల్లి జడ్పీ హైస్కూలు ఆవరణలో ఈ ఎంపికలు జరుగుతాయని ఎంఈవో తెలిపారు. పీడీలు కోడే రోజా, భాస్కర్, రత్నారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్ట పరిహారం జమ

ముదినేపల్లి, సెప్టెంబరు 25 : ఇటీవల భారీ వర్షాలకు సార్వా వరి పంట కోల్పోయిన రైతులకు బుధవారం తమ బ్యాంక్ ఖాతాల్లో పరిహారం జమ అయింది. సీఎం చంద్రబాబు హామీ మేరకు పంట నష్టం నమోదు చేసిన పది రోజుల లోపే ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఎకరానికి రూ.10 వేలు చొప్పున రైతుల ఖాతాలకు జమ అయింది. ముదినేపల్లి మండలంలోని 1850 మంది రైతులకు రూ.2.90 కోట్లు బ్యాంక్ ఖాతాల్లో జమ అయినట్లు మండల ఏవో వేణుమాధవ్ తెలిపారు.

## వినోద్‌కు సత్కారం

ముదినేపల్లి, సెప్టెంబరు 25 : ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ నియోజకవర్గ కో-కన్వీనర్ కొడాలి వినోద్‌ను మండలంలోని పలువురు పార్టీ నాయకులు అభినందించారు. బుధవారం వినోద్‌ను ఆయన నివాసం వద్ద తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, పార్టీ నాయకులు యార్లగడ్డ గంగయ్య, పరసా కృష్ణ, మండవల్లి మండల పార్టీ కార్యకర్తలు తదితరులు సత్కరించి అభినందించారు.



చాట్రాయిలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమం

### ఆధునిక విధానాలతో..

## వ్యవసాయానికి మహర్దశ

### పొలం పిలుస్తోందిలో అధికారులు

చాట్రాయి, సెప్టెంబరు 25: ఆధునిక విధానాలతో వ్యవసాయానికి మహర్దశ తీసుకురావటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు అన్నారు. చాట్రాయిలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోందిలో వారు మాట్లాడుతూ యువతను వ్యవసాయంలో ప్రోత్సహించి, ఆధునిక వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై ఇవ్వటానికి ప్రభుత్వం ప్రణా ళికలు రూపొందిస్తోందన్నారు. ఏవో శివశంకర్, నాయకులు పాల్గొన్నారు.

**కలిదిండి:** చేపలు, రొయ్యల చెరువులను అప్సడా చట్టం కింద రిజిస్ట్రేషన్లు చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని మండల మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్ అన్నారు. బుధవారం మూల్లంక, పెదలంక గ్రామాల్లో పొలం పిలుస్తోంది లో ఆయన మాట్లాడుతూ చేపలు, రొయ్యల వ్యాధుల నిర్ధారణకు కైకలూరులో ఆక్వా ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆక్వా కల్చర్ సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 155251కి కాల్ చేయాలన్నారు. రైతు శిక్షణ కేంద్రాల్లో మినీ ఆక్వా ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని, మేతల ధరలు తగ్గించాలని రైతులు విన్నవించారు. మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**కైకలూరు:** వరిలో అధిక దిగుబడులను సాధించేందుకు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. బుధవారం గోపవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగు సమస్యలపై అధికారులతో చర్చిస్తే సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతారన్నారు. అలాగే ప్రతి రైతు తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఏడీ ఆర్. గంగాధరరావు, పశుసంవర్ధకశాఖ ఏడీ ముస్తాఫా ఖాన్, మండల వ్యవసాయాధికారిణి ఆర్. దివ్య, మత్స్యశాఖ అభివృద్ధి అధికారిణి భవిత, గోపవరం సర్పంచ్ ఉలిసి వసంతకుమారి పాల్గొన్నారు.

**ముదినేపల్లి:** దాకరం, పెయ్యేరు శివారు అప్పారావుపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వరి సాగులో పాటించాల్సిన వరి యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, పశువుల్లో నట్టల నివారణ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏవో వేణుమాధవ్, పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతి కుమార్ రైతులకు వివరించారు. చేప బెల్లం ద్రావణం తయారీపై అవగాహన కల్పించి, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ధాన్యం దిగుబడికి పలు సూచనలు చేశారు. టీడీపీ నాయకులు దుక్కిపాటి శేషుబాబు, హనుమార పేర్నీడు, దాకరం సర్పంచ్ జాస్తి రాజా తదిరతులు పాల్గొన్నారు.

## రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం: మంత్రి సారథి



నూజివీడు, సెప్టెంబరు 25: నూజివీడు మండలం లోని సీతారాంపురం, పల్లెర్లమూడి, మీర్జాపురం గ్రామాల్లో పలు సీసీ రోడ్లకు మంత్రి పార్థసారథి బుధవారం శంకుస్థాపనలు చేశారు. 23.40 కోట్లతో సీతారాంపురం నుంచి బొమ్ములూరు వరకు విస్తరించిన రహదారిని మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ రహదారులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని రాష్ట్రంలో దెబ్బతిన్న రోడ్ల అభివృద్ధికి ఈ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు వర్షాలు పూర్తిగా తగ్గిన తరువాత రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్‌మోషే, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ భాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈలు తదితరులు పాల్గొన్నారు. వృత్తులను లాభసాటిగా మార్చాల్సిన బాధ్యత మనందరి పై ఉందని మంత్రి అన్నారు. బుధవారం రాత్రి నూజివీడులో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులు, రైతులు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ డెయిరీ ఫాంలు, కోళ్ల ఫారాలు తదితర వాటి కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. పశుసంవర్ధకశాఖ అధికారులు, స్థానిక నాయకులు, రైతులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## వరద బాధితుల కోసం విరాళాలు

నూజివీడు, సెప్టెంబరు 25: నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి కొలుసు పార్థసారథికి గ్రామస్థులు, టీడీపీ నాయకులు వరద బాధితుల సహాయార్థం విరాళాల చెక్కులను అందించారు. నూజివీడు పట్టణ టీడీపీ నాయకులు 1.26 లక్షల చెక్కును, సీతారాంపురం గ్రామపెద్దల తరఫున 1.45 లక్షలు, అలాగే రాము అనే వ్యక్తి రూ.25 వేలు చెక్కును మంత్రికి అందించారు.

**ముదినేపల్లి:** పెదగొన్నూరులోని శ్రీ శ్రీనివాసా చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బట్టు నాగ మల్లేశ్వరరావు వరద బాధితులకు రూ.లక్షను విరా సీఎం సహాయనిధికి ఎమ్మెల్యే శ్రీనివాస్ ద్వారా అందజేశారు. దాకరం గ్రామానికి చెందిన వల్లూరు వంశీ మోహన్ రూ.25 వేలు విరాళంగా అందజేశారు.

## ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయండి

ముసునూరు, సెప్టెంబరు 25: ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నూజివీడు డీఎల్‌పీవో, మండల ప్రత్యేక అధికారి సుందరి, అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో పాటు సచివాలయ ఉద్యోగులతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మన ఇల్లు - మన గౌరవం, స్వచ్ఛతా హీ సేవా, ఇది మంచి ప్రభుత్వం, ఓటర్ల ఇంటింటి సర్వే, స్వర్ణాంధ్ర-2047 తదితర కార్యక్రమాలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎంపీడీవో జి.రాణి, తహసీల్దార్ రాజ్‌కుమార్, హౌసింగ్ ఇన్‌ఛార్జ్ ఏఈ శివ, ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే సమగ్ర అభివృద్ధి

కైకలూరు, సెప్టెంబర్ 25: సీఎం చంద్రబాబుతో సమగ్ర అభివృద్ధి సాధ్యమని మాజీ వైస్ ఎంపీపీ ఎంఏ రహీం అన్నారు. బుధవారం కైకలూరు 111వ బూత్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి పోలవరపు లక్ష్మీరాణి, టీడీపీ నాయకులు వీరాబత్తిన సుధా, అధికారులు పాల్గొన్నారు. అలాగే కైకలూరు పట్టణంలోని 119వ బూత్‌లో జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కెకె బాబు, తెలుగు మహిళా కార్యదర్శి శీలం కృష్ణవేణి తదితరులు ఇంటింటికి వెళ్లి వంద రోజులపాలనపై ప్రజలకు వివరించారు.

**ముసునూరు:** రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని సర్పంచ్ లక్ష్మిసత్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బర్మా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరి మానురాజు సురేష్ అన్నారు. బుధవారం అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం అని అధికారులు, నాయకులు సంయుక్తంగా నిర్వహించారు. రమణక్కపేట టీడీపీ గ్రామ అధ్యక్షులు రంగు ఆంజనేయులు యువనేత రంగు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**కలిదిండి:** వెంకటాపురంలో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఈ వంద రోజుల్లో ప్రభుత్వం సాధించిన విజయాలపై కరపత్రాలను పంపిణీ చేశారు.



కైకలూరులో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు, నాయకులు పాల్గొన్నారు.

**ముదినేపల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పెయ్యేరు ఆటోనగర్ లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, టీడీపీ నాయకులు మరడాని సత్యనారాయణ, జొన్నలగడ్డ వీరాస్వామి, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ అడుసుమిల్లి సాయికృష్ణ, జనసేన నాయకుడు వీరబాబు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్వో కేశవ తదితరులు కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలను వివరించారు.

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

నూజివీడుటౌన్, సెప్టెంబరు 25: నూజివీడు పెద్ద గాంధీబొమ్మ సెంటర్లో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షుడు బోను అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జీవితం చివరి అంకం వరకు దేశం కోసం పరితపించిన వ్యక్తి దీన్ దయాళ్ అన్నారు. బీజేపీ నాయకులు శివరాజు వసుంధరా దేవి, మాగంటి వాసు, మాటూరి రవికాంత్, రెడ్డి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

**చాట్రాయి:** మండలంలోని చనుబండలో జన సంఘ్ నేత పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నాయకులు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఓబిళ్ళనేని రాజా, మండల నాయకులు బుర్రి శ్రీకర్, బజ్జూరి గోపి, శెట్టిపల్లి రవి దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ దీనదయాళ్ ఉపాధ్యాయ, ఆర్ఎస్ఎస్‌లో సత్సంగ్ సేవకుడుగా పనిచేసి జనసంఘ్ పార్టీలో చేరి 1967లో ఆపార్టీకి అధ్యక్షుడు అయ్యారని, అంటరానితనం బలంగా ఉన్న రోజుల్లో అంబేడ్కర్‌ని పశ్చిమ బెంగాల్ నుంచి చట్టసభకు పంపటానికి మద్దతు ఇచ్చారని అన్నారు.

**ముసునూరు:** ముసునూరు బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మాగంటి వాసు మాస్టారు దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ తన జీవితంతో చివరిక్షణం వరకు దేశంకోసం పరితపించిన సంఘసంస్కర్త అని కొనియాడారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నూజివీడులో దీన్‌దయాళ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

**కైకలూరు:** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో మండల బీజేపీ అధ్యక్షుడు కట్టా వీరరాఘవులు అధ్యక్షతన నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ వేంపాటి విష్ణురావు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి బొల్లా శ్యామలరాజు, మండల ప్రధాన కార్యదర్శి వేంపాటి గోవింద చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మన ఇల్లు - మన గౌరవం విజయవంతం చేయాలి

కలిదిండి, సెప్టెంబరు 25: మండలంలో ఈ నెల 28 నుంచి 'మన ఇల్లు - మన గౌరవం'పై నిర్వహించే సభలను విజయవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ శేఖర్ కోరారు. బుధవారం కలిదిండి తహసీల్దార్ కార్యాలయంలో మండల హౌసింగ్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలనీల్లో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి లబ్ధిదారుడు పక్కా గృహం నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2025 సంవత్సరం మార్చి 31వ తేదీ లోగా పక్కా గృహాలు నిర్మించకపోతే రద్దవుతాయన్నారు. తహసీల్దార్ రామకృష్ణ, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

**ఆగిరిపల్లి:** ఆగిరిపల్లి మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గత ప్రభుత్వంలో ఇల్లు కట్టకుండా అసంపూర్తిగా మిగిలిన ఇళ్ల కు డిసెంబర్ 31లోగా పూర్తిచేస్తే బిల్లులు వస్తాయని లేకపోతే స్కీమ్‌కు అర్హులు కారని హౌసింగ్ ఏఈ అలీముల్లా వివరించారు.

## చదువు ఆపేసిన వారికి వరం సార్వత్రిక విద్య

చాట్రాయి, సెప్టెంబరు 25: వివిధ కారణాలతో చదువును మధ్యలో ఆపిన వారికి సార్వత్రిక విద్య వరం లాంటిదని ఎంఈవో బ్రహ్మాచారి అన్నారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో బుధవారం సార్వత్రిక విద్యా విధానంపై మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువు మధ్యలో మానేసిన 14 ఏళ్ళు నిండిన వారు ఓపెన్ టెన్త్, 16 ఏళ్ళు నిండిన వారు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించవచ్చునని అన్నారు. సెలవు దినాల్లో తరగతులు నిర్వహించబడతాయని, ఏవేనా ఇష్టమైన 5 సబ్జెక్ట్‌లతో కోర్సు పూర్తి చేయవచ్చునని, ఉచిత పాఠ్య పుస్తకాలు, సులభమైన స్వీయ అభ్యాసనా సామాగ్రి అందించబడుతుందని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి, హెచ్ఎం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## 13 బైక్‌లు స్వాధీనం.. నిందితుడికి రిమాండ్

చాట్రాయి, సెప్టెంబరు 25: ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న కోట రవి (29)ని పోలీసులు అరెస్ట్ చేశారు. చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూజివీడు రూరల్ సీఐ కె. రామకృష్ణ, ఎస్సై డి. రామకృష్ణ వివరాలు వెల్లడించారు. చాట్రాయి మండలం పోలవరానికి చెందిన కోట రవి కొంత కాలంగా చోరీలకు పాల్పడుతున్నాడని, ఏలూరు పట్టణంలో 8 బైక్‌లు, చాట్రాయి పోలీస్ స్టేషన్ పరిధిలో 3 బైక్‌లు, ఒక మేకపోతు, ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఒక బైక్ చోరీ చేశాడన్నారు. మంగళవారం రాత్రి నిందితుడు రవిని అరెస్ట్ అతడు ఇచ్చిన సమాచారం మేరకు రూ. 5 లక్షలు విలువ చేసే 12 బైక్‌లు, నేరానికి ఉపయోగించిన మరో బైక్‌ను, ఒక మేకపోతును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మోటార్ సైకిళ్ళ రికవరీలో ప్రతిభ చూపిన ఎస్సై డి. రామకృష్ణ, హెచ్‌సి విజయ భాస్కర్, పీసీలు విష్ణుకుమార్, గిరిబాబును జిల్లా ఎస్పీ అభినందిస్తూ పంపిన క్యాష్ రివార్డులను సీఐ అందజేశారు. కాగా నిందితుడిని తిరువూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

## చోరీ కేసులో ఇద్దరికి జైలు

**కైకలూరు:** కైకలూరులో జరిగిన ఓ చోరీ కేసులో ఇద్దరు ముద్దాయిలకు సాధారణ జైలు శిక్ష విధిస్తూ కైకలూరు జూనియర్ సివిల్ న్యాయసేవాధికారి ఎం. శివకిరణ్ బుధవారం తీర్పునిచ్చారు. కేసు వివరాలను కైకలూరు టౌన్ సీఐ పి. కృష్ణ వెల్లడించారు. కైకలూరు జగనన్న కాలనీలో నివశిస్తున్న పల్లపోతు రామకృష్ణ ఇంటిలో 2022 నవంబరు 27వ తేదీన రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో చోరీకి పాల్పడ్డారు. రామకృష్ణ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చోరీకి పాల్పడిన ఏలూరు చేపలతూము

## క్రైం కార్నర్..

సెంటర్‌కు చెందిన అత్తోటి జాన్‌పాల్(19), ఏలూరు ఆర్‌ఆర్‌పేటకు చెందిన గౌతు శేషు(21), కాకినాడ తిమ్మాపురానికి చెందిన కొటారు వాసు(34)ను అప్పటి ఎస్సై ప్రతాప్‌రెడ్డి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వారిపై కోర్టులో విచారణ జరగ్గా బుధవారం తీర్పునిచ్చినట్లు తెలిపారు. ఏపీపీ గంగామణి వాదనలు విన్పించారు. అత్తోటి జాన్‌పాల్, గౌతు శేషుల వద్ద చోరి సొత్తు ఉండడంతో వారికి రిమాండ్ కాలాన్ని సాధారణ జైలు శిక్షగా కోర్టువారు పరిగణించి న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు తెలిపారు. కోటారు వాసుపై నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేసినట్లు సీఐ తెలిపారు.

## పంట కాల్వలో మృతదేహం ఆచూకీ లభ్యం

**కైకలూరు:** పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం వివరాలు తెలిసినట్లు కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ తెలిపారు. ఈ నెల 21న ఏలూరు జిల్లా కైకలూరు మండలం వింజరంలోని పోల్‌రాజ్ పంటకాలువ లాకుల వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు వీఆర్వో ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. పంటకాలువలో గుర్తుతెలియని మృతదేహం శీర్షికన ఈ నెల 22న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్త ఆధారంగా మృతుడి కుమార్తె జ్యోతిర్మయి కైకలూరు టౌన్ పోలీసులను బుధవారం సంప్రదించింది. దీంతో పోలీసులు మార్చురీలోని మృతదేహాన్ని చూపించగా మృతుడి చేతివేళ్ళను చూసి ఆమె తండ్రిగా గుర్తించింది. మృతుడు తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు నక్కిన నాగభూషణం (47)గా గుర్తించారు. నాగభూషణం ఈ నెల 1న తెలంగాణాలో వివిధ గ్రామాల్లో తన బంధువుల ఇంటి వద్ద చేనేత పనికి వెళ్లాడు. ఇటీవల వరదలు రావడంతో మగ్గాలు వర్షపు నీటితో నిండి పనిచేసేందుకు అవకాశం లేక తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. మహబూబాబాద్ సమీపంలో రాళ్ళవాగు దాటుతుండగా నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. కృష్ణా నది ద్వారా కాలువల వెంబడి వింజరం వరకు మృతదేహం కొట్టుకువచ్చినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు తెలిపారు.

### సీబీఐ పోలీసులమని బెదిరించి

## రూ. 9 లక్షలు లాగేశారు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 :మీ నెంబర్ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారంటూ ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ.9 లక్షలు లాగేశారు. బాధితుడు తేరుకుని ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మహ్మద్ రాహిల్ (29) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉన్నారు. బుధవారం అతనికి ఒక వ్యక్తి ఫోన్ చేసి తాము ట్రాయ్ నుంచి మాట్లా డుతున్నామని చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడుతున్నారంటూ బెదిరించాడు. కాల్‌ను మరో వ్యక్తికి ట్రాన్స్‌ఫర్ చేయగా తాము ముంబై సీబీఐ పోలీసులమని బెదిరించి రూ.9 లక్షలను బదిలీ చేయించుకున్నారు. తాము ముంబై సీబీఐ పోలీసులమని క్రైం బ్రాంచ్‌కు చెందిన వారమని ఆధార్ కార్డు, అతని వివరాలను చెప్పారు. భయపెట్టి రూ.9 లక్షలను కాన్పూర్ మార్కెట్ ఏరియాలోని సీఎస్‌బీఐ బ్యాంక్ అకౌంట్‌కు బదిలీ చేయించుకున్నారు. తాను మోసపోయానని గ్రహించి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అకౌంట్‌కు బదిలీ అయిన సొమ్మును తిరిగి రప్పించేందుకు సైబర్ సెల్ విభాగానికి సమాచారం ఇచ్చారు.

## ట్రిపుల్ ఐటీలో త్వరలో మెస్ టెండర్ల ఖరారు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 25: నూజివీడు ట్రిపుల్ ఐటీలో త్వరలో మెస్ టెండర్లను ఖరారు చేసి నూతన క్యాటరర్లకు మెస్‌లను అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ చెప్పారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల నూజివీడు ట్రిపుల్ ఐటీలో నెలకొన్న మెస్ వివాదాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం త్రిమెన్ కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. దీంతో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 6 వేల మందికి భోజన సదుపాయాలు అందించే ముగ్గురు క్యాటరర్లలో ఇద్దర్ని తొలగించామన్నారు. కేవలం ఒక్కరే ఆరు వేల మందికి భోజనం అందిస్తున్నారని సమస్యల పరిష్కారానికి నూతన టెండర్లను పిలిచి అక్టోబరు 3వ తేదీ లోపు నూతన క్యాటరర్లకు బాధ్యతలు అప్పగిస్తామన్నారు. బియ్యం నాణ్యత విషయంలో పౌర సరఫరాల విభాగం నుంచి బియ్యం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు లాప్‌ట్యాప్‌లు, యూనిఫాం అందించాల్సి ఉందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో టెండర్లు పిలవకపోవడం వల్ల సమస్య వచ్చిందన్నారు. అకడమిక్ క్యాలెండర్ రూపకల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫుడ్ కోర్టు విషయంలో త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. ఏవో లక్ష్మణ్, పీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసించాలి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 25: ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎంపవర్ స్కిల్స్ అకాడమీ కౌన్సిలర్లు కె.వెంకట్, కె.ప్రదీప్, కిషోర్ పేర్కొన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సమయపాలన, స్టడీ స్కిల్స్‌పై వారు అవగాహన కల్పించారు. కన్వీనర్ నాగార్జునాదేవి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌లు బ్రహ్మాస్వాములు, డాక్టర్ దుర్గాదేవి, సైకాలజీ ఫ్యాకల్టీ డాక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 25: ఆరోగ్యకర సమాజం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని అందులో ఫార్మసీ రంగం ప్రాధాన్యత ఎంతో ఉందని నూజివీడు పట్టణ సీఐ పి.సత్యశ్రీనివాస్ అన్నారు. నూజివీడు సిద్ధార్థ బి.ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మసీ డేను పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యంగా ఉండేందుకు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన ఉండాలన్నారు. బి.ఫార్మసీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## నూజివీడులో భారీ వర్షం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 25: నూజివీడు మండలంలో గత 24 గంటల్లో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా పడిన వర్షంతో వాగులు, వంకలు పొంగి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. దిగవల్లి గ్రామంలో నక్కలవాగుకు గండి పడటంతో వాగునీరు ప్రధాన వీధులలో ప్రవహించడంతో సచివాలయం వద్ద భారీగా వరద చేరింది. నూజివీడు డివిజన్ వ్యాప్తంగా 39.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ముసునూరులో 88.4, అత్యల్పంగా లింగపాలెంలో 3.2 వర్షపాతం నమోదైంది. చింతలపూడిలో 56.2, ఆగిరిపల్లిలో 48.2, నూజివీడులో 36.4, చాట్రాయిలో 4.2 మిల్లీమీటర్లు నమోదైంది.

**ముసునూరు:** బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో సింహాద్రిపురం వద్ద రామిలేరు వాగు నూజివీడు ప్రధాన రహదారిపై ఉధృతంగా ప్రవహించడంతో మధ్యాహ్నం వరకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే వలసపల్లి ప్రధాన రహదారిలోని సంధ్య వాగు, అక్కిరెడ్డిగూడెం ప్రధాన రహదారిలో ఉన్న కట్టుకాలువ సైతం ఉధృతంగా ప్రవహించడంతో మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రానికి వరద ఉధృతి తగ్గడంతో యధావిధిగా కొనసాగాయి.

## కోతకు గురైన రహదారి పరిశీలన

ముసునూరు, సెప్టెంబరు 25: మండలంలోని చెక్కపల్లి వద్ద సంధ్యవువాగు ఉధృతికి కోతకు గురైన ప్రధాన రహదారిని తహసీల్దార్ రాజ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్‌అండ్‌బీ అధికారులతో రహదారి పరిస్థితి పై ఫోన్‌లో మాట్లాడారు. వరద ఉధృతికి మరలా రహదారి కోతకు గురైందని, తక్షణమే దీన్ని పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని ఆయన ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

## విద్యార్థులు ప్రణాళికతో చదవాలి : డీవైఈవో

ముసునూరు, సెప్టెంబరు 25: విద్యార్థులు ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నూజివీడు డివైఈవో సేవ్యా అన్నారు. బుధవారం చెక్కపల్లి జడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మధ్యాహ్నం భోజనం నాణ్యత తనిఖీ చేశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలను వేసి సమాధానాలు రాబట్టారు. హెచ్ఎం అబ్బాస్‌బాకరి, స్టాఫ్ సెక్రటరి జి.పద్మకిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డాక్టర్ గోగినేని భాస్కర్‌రావు మృతి



నూజివీడు, సెప్టెంబరు 25: నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన డాక్టర్ గోగినేని భాస్కర్‌రావు(86) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన అంతిమ సంస్కారాలను బాపులపాడు హిందూ శ్మశాన వాటికలో ఆయన కుమారులు బుధవారం నిర్వహించారు. భాస్కర్‌రావు తొలి తరం బీజేపీ నాయకుడు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు పదవులను అలంకరించారు. గొల్లపల్లి రఘునాథస్వామి దేవస్థానం బోర్డు చైర్మన్‌గా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌లో పలు పదవులు నిర్వహించారు. ఈయనకు పేదల వైద్యుడిగా పేరు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వారు కూడా వైద్య, న్యాయ రంగంలో సేవలు అందిస్తున్నారు. భాస్కర్‌రావు పార్థివదేహాన్ని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధన్‌రావు, టీడీపీ నాయకులు ఆళ్ళ గోపాలకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. గోగినేని శ్రీనివాస్‌కుమార్ అప్పారావు బీజేపీ కండువా వేసి నివాళులర్పించారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

కైకలూరు, సెప్టెంబరు 25: చిగురుకోటలోని 132/33కెవి సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ తెలిపారు. కలిదిండి మండలంలో పోతుమర్రు, కలిదిండి, కోరుకొల్లు, మూలలంక, కాళ్ళపాలెం సబ్ స్టేషన్లలో, కైకలూరు మండలంలో వరహాపట్నం సబ్ స్టేషన్లో ముదినేపల్లి మండలం చిగురుకోట సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి, సింగరాయపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

## రేపు స్వర్ణాంధ్రపై విద్యార్థులకు పోటీలు

ముసునూరు, సెప్టెంబరు 25: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్వర్ణాంధ్ర-2047పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంఈవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ముసునూరు జడ్పీ పాఠశాలలో ఉదయం 11 గంటల నుంచి జరిగే ఈ పోటీలకు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ వారి పాఠశాలల నుంచి విద్యార్థులను పోటీలకు పంపాలని కోరారు.

## మెనూ ధరలు పెంచాలి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 25: మధ్యాహ్న భోజన పథకం మెనూ ధరలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.రాజు అన్నారు. నూజివీడులో మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు తొలగించాలని కోరుతూ అక్టోబరు 2న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించగా పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు, మెనూ ధరలను పెంచాలని డిమాండ్ చేశారు. ఎండీఎం నాయకులు వెంకటేశ్వరమ్మ, అరుణ, వంశీ, రంగబాబు, పుల్లమ్మ పాల్గొన్నారు.

## బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

నూజివీడు టౌన్, సెప్టెంబరు 25:స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -14, 17, ఉమ్మడి కృష్ణాజిల్లా జట్ల ఎంపిక ప్రక్రియను నూజివీడు విక్టోరియా టౌన్ హాల్లో బుధవారం నిర్వహించారు. నూజివీడు డీవైఈవో ఎం.సేవ్యా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ దాసరి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారుల ఎంపికను ప్రారంభించారు. అండర్ -14, 17 బాలుర, బాలికల జట్లను పీడీలు ఎస్.లక్ష్మి, సుగుణరావు, రవీంద్ర, సుకుమార్, నాగరాజు తదితరులు ఎంపిక చేశారు.

## ఆలయ శుద్ధి

ఆగిరిపల్లి, సెప్టెంబరు 25: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఆగిరిపల్లి మండలం ఈదర అడ్డరోడ్డులోని భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు ఆధ్వర్యంలో జన సైనికులు బుధవారం ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం పూజలు చేశారు. ముక్కు మహేష్, సముద్రాల కిరణ్, సువర్ణబాబు, రమేష్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.